ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
శుక్రవారం 7 ఫిబ్రవరి 2025




పల్లెకు మళ్లీ సంక్రాంతి



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి తదితరులు

- సౌత్‌మోపూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- గతనెల 28న 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా'
- రూ.కోటితో వివిధ పనులకు రూరల్ ఎమ్మెల్యే హామీ
- రూ.1.22 కోట్లతో వాగ్దానం నెరవేర్చిన కోటంరెడ్డి
- ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ప్రయత్నానికి భారీ స్పందన
- గ్రామస్థుల హర్షాతిరేకాలు

నెల్లూరురూరల్, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా...' అనే వినూత్న కార్యక్రమానికి ఏబీఎన్-ఆంధ్రజ్యోతి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. గత నెల 27న నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరు గ్రామ సమస్యలను ఆంధ్రజ్యోతి తెరపైకి తీసుకువచ్చి, ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతో మరుసటి రోజు (జనవరి 28న) సౌత్‌మోపూరులో అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా... కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డిలతోపాటు అధికార యంత్రాంగం పాల్గొన్నారు.



ఈ సందర్భంగా గ్రామస్థులు తమ సమస్యలను సభాముఖంగా పాలకులు, అధికారుల దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆంధ్రజ్యోతి ద్వారా బహిర్గతమైన సమస్యలను పరిష్కరించేందుకు ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.కోటి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అతి త్వరలోనే ఈ నిధులు ఖర్చు చేసేందుకు శంకుస్థాపన కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ గురువారం సౌత్‌మోపూరు లోని గంగమ్మగుడి కూడలి వేదికగా రూ.1.22 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేశారు. అధికార యంత్రాంగంతో తరలివచ్చి సంక్రాంతి తరువాత సౌత్‌మోపూరుకు మరో పండుగను తీసుకువచ్చారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

నిధుల కేటాయింపు ఇలా..

- ప్రధాన రోడ్డును లెవలింగ్ చేసి సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.55 లక్షలు
- వాణిశ్రీ ఉన్నత పాఠశాలకు ప్రహరీగోడ నిర్మించేందుకు రూ.20 లక్షలు
- మొగళ్లపాళెంలో సీసీరోడ్లకు రూ. 10 లక్షలు
- కనుజులమిట్ట (ఎస్టీకాలనీ)లో శ్మశానం ప్రహరీగోడ నిర్మాణానికి రూ. 10 లక్షలు
- బీసీకాలనీలో అరుగు నిర్మాణానికి రూ. 2లక్షలు
- ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రోడ్డు నిర్మాణానికి రూ. 5 లక్షలు
- గమళ్లపాళెంలో రోడ్డు నిర్మాణానికి రూ. 4 లక్షలతో పాటు డ్రైన్లు, ఇతర నిర్మాణాలకు మరో రూ. 16 లక్షలు

ఇవన్నీ కలిసి ఎంపీ ల్యాడ్స్ ద్వారా వచ్చిన రూ.1.22 కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఏకకాలంలో గురువారం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పది రోజుల వ్యవధిలో సమస్యలను పరిష్కరించేందుకు శంకుస్థాపనలు చేస్తామని గతంలో ప్రకటించామని, ఈ క్రమంలో గురువారమే పనులకు శంకుస్థాపన చేశామన్నారు. సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించేలా చేసిన ఏబీఎన్, ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పత్రిక వార్తలకే పరిమితం కాకుండా ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఇలాంటి వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిన ఏబీఎన్, ఆంధ్రజ్యోతిక ధన్యవాదాలని ఆయన పేర్కొన్నారు.

జైకా పనులు కాక!

- నిరుపయోగం కానున్న నిధులు
- రూ.65 కోట్లకు చేసింది రూ.19.68 కోట్ల పనులే!
- వైసీపీ పాలనలో నిర్లక్ష్యం
- 40 శాతమూ కాని చెరువుల అభివృద్ధి
- మార్చిలోపు పూర్తి చేయాలని ఆదేశం
- గత ఐదేళ్లలో రెండు ప్యాకేజీలే పూర్తి
- 11 వర్కులపై వేలాడుతున్న కత్తి
- బిల్లుల భయంతో పనులు చేయని కాంట్రాక్టర్లు

> "చెరువు కట్టలను పటిష్ట పరచడం, తూములను ఆధునికీకరించడం, కాలువలను బాగు చేయడం జైకా వర్కుల ప్రధాన లక్ష్యం. మొత్తం 13 ప్యాకేజీలుగా జిల్లాలోని చెరువులను అభివృద్ధి చేయాలని టెండర్లు పిలిచి పనులు అప్పగించారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చాలాచోట్ల పనులు సవ్యంగా సాగలేదు."



ఉదయగిరి అనకట్ట సుందరీకరణలో భాగంగా కట్టకు జరుగుతున్న రివిట్‌మెంట్ పనులు

నెల్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాలు నేడు శాపాలుగా జిల్లా ప్రజలను వెంటాడుతున్నాయి. చెరువుల అభివృద్ధికి జైకా నిధులిచ్చినా నాటి పాలకులు ఉపయోగించుకోలేకపోయారు. అభివృద్ధి చేయాల్సిన చెరువులను గాలికొదిలేశారు. ఇప్పుడు ఆ వర్కులన్నింటినీ మార్చిలోపు పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ఆ తర్వాత చేసే పనులకు నిధులు సమకూరవు. ఈ నేపథ్యంలో జిల్లాలో కీలకమైన 11 వర్కులు అసంపూర్తిగానే క్లోజ్ అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒక్కో వర్కు కింది రెండు, మూడు చెరువులను అభివృద్ధి చేయాల్సి ఉంది. ఎంత వేగంగా పనులు చేసినా మార్చిలోపు అసంపూర్తి పనులు పూర్తి చేయడం సాధ్యపడదని ఇరిగేషన్ ఇంజనీర్లు చెబుతున్నారు. గడువు ముగిసేలోపు వీలైనన్ని ఎక్కువ పనులు చేయించేందుకు వారు యత్నిస్తున్నారు.

13 ప్యాకేజీలు.. పూర్తయింది రెండే!

ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో 2018-19 నుంచి 2023-24 సంవత్సరాల మధ్య ప్రధానమైన ఆయకట్టు చెరువులను అభివృద్ధి చేసేందుకు జైకా సంస్థ ముందుకొచ్చింది. ఇందుకుగాను సుమారు రూ.65 కోట్లు సమకూర్చేలా ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. చెరువు కట్టలను పటిష్ట పరచడం, తూములను ఆధునికీకరించడం, కాలువలను బాగు చేయడం జైకా వర్కుల ప్రధాన లక్ష్యం. మొత్తం 13 ప్యాకేజీలుగా చెరువులను అభివృద్ధి చేయాలని టెండర్లు పిలిచి పనులు అప్పగించారు. ప్యాకేజీ 1, 7, 9, 10, 11 కింద ఉదయగిరి నియోజకవర్గంలో, ప్యాకేజీ 2, 3, 6 కింద గూడూరు నియోజక వర్గంలో, ప్యాకేజీ 4 కింద వెంకటగిరి నియోజకవర్గంలో, ప్యాకేజీ 5, 8, 13 కింద సర్వేపల్లి నియోజకవర్గంలో, ప్యాకేజీ 12 కింద కావలి నియోజకవర్గంలో చెరువులు, కాలువలను బాగు చేయాల్సి ఉంది. ఈ మొత్తం 13 ప్యాకేజీల్లో ఆరు ప్యాకేజీ వర్కులను 2018-19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో టెండర్లు పిలిచి అప్పగించారు. మిగిలిన వర్కులకు వైసీపీ ప్రభుత్వంలో 2022-24 మధ్య కాలంలో టెండర్లు పిలిచారు. అయితే చాలా పనులు సగం కూడా పూర్తి కాలేదు. కేవలం రెండు ప్యాకేజీలు మాత్రమే పూర్తయ్యాయి. కొన్ని 15, 20 శాతం మాత్రమే పనులు చేసినవి కూడా ఉన్నాయి. మొత్తం ఆరు ప్యాకేజీల్లోని వర్కులు 40 శాతంలోపే జరిగాయి. అన్ని వర్కుల అగ్రిమెంట్ విలువ రూ.50.76 కోట్లు ఉంటే ఇప్పటి వరకూ రూ.19.68 కోట్ల విలువైన పనులు మాత్రమే జరిగాయి. అంటే సరాసరి 40 శాతం కూడా జైకా పనులు పూర్తి చేయలేదు.

కక్షసాధింపు ధోరణితో ఆలస్యం

వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక అంతకముందు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో మంజూరైన పనులపై కక్షసాధింపు ధోరణిలో వ్యవహరించింది. దీంతో జైకా సంస్థ చేపట్టిన పనులు ముందుకు సాగలేదు. అలానే వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన పనులు కూడా ఆశించినంతగా ముందుకు కదల్లేదు. ఇందుకు ప్రధాన కారణం


మిగతా 6వ పేజీలో..

నారాయణకు 14.. ఆనంకు 16!

- ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రులకు ర్యాంకులు
- గౌరవప్రద స్థానాలపై ప్రజల హర్షం

నెల్లూరు, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): పరిపాలనలో జవాబుదారీతనం, బాధ్యతలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చే నాయకుడిగా గుర్తింపు పొందిన సీఎం చంద్రబాబు నాయుడు ప్రజల్లో ఆవిశ్వాసం చెక్కుచెదరనివ్వకుండా పాలన సాగించే ప్రయత్నం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఆరునెలల్లో తనతోసహా మంత్రుల పనితీరుకు ర్యాంకులు ప్రకటించారు. ఈ ర్యాంకుల ద్వారా పనితీరును మరింత మెరుగుపరుచుకునే దిశగా మంత్రులకు దిశానిర్దేశం చేస్తున్నారు. పాలనా రంగంలో చంద్రబాబుది ప్రత్యేక శైలి. ఆయన్ను రాజకీయ నాయకుడిగా కన్నా మంచి పరిపాలనాదక్షుడిగానే ప్రజలు ఎక్కువగా గుర్తిస్తారు. రాష్ట్రం క్లిష్టపరిస్థితులు ఎదుర్కొన్న అన్ని సందర్భాల్లోనూ ప్రజలు చంద్రబాబునే అధికారపీఠంపై కూర్చోబెట్టడం ఇందుకు నిదర్శనం. తన పాలనాదక్షతపై ప్రజలకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునే దిశగా చంద్రబాబు ఎప్పటికప్పుడు పాలనలో కొత్త ఒరవడిని, సాంప్రదాయాలను ప్రవేశపెడుతూనే వస్తున్నారు. జన్మభూమి, ప్రజల వద్దకు పాలన, శ్రమదానం లాంటి వినూత్న పథకాలతో మంచి పరిపాలనాదక్షుడిగా ప్రజల్లో ముద్రవేసుకున్నారు. ఇప్పుడు అదే ఒరవడితో తనతో సహా క్యాబినెట్ మంత్రుల అందరి పనితీరును ప్రతి ఆరు నెలలకు ఒకసారి లెక్కకట్టి ప్రజల ముందు పెడుతున్నారు. ఈ ర్యాంకుల ద్వారా మంత్రుల్లో పోటీతత్వం పెంచి పనితీరును మరింత మెరుగుపరచాలని, ప్రజలకు ప్రభుత్వం పట్ల మరింత విశ్వసనీయత పెంచుకోవాలనే ప్రయత్నంలో భాగంగా ఈ ఐదేళ్ల పాలనకు సంబంధించి మొదటి ఆరు నెలల కాలంలో ఫైళ్ల క్లియరెన్స్‌కు సంబంధించి మంత్రులకు ర్యాంకులు ప్రకటించారు. ఈ ర్యాంకుల వరుసలో తాను ఆరవ స్థానంలో ఉన్నానని చంద్రబాబు స్వయంగా ప్రకటించుకున్నారు. ఇక జిల్లాకు చెందిన మంత్రులు పొంగూరు నారాయణ,





ఆనం రామనారాయణరెడ్డిలు ర్యాంకుల వరసలో మధ్యలో ఉన్నారు. ఫైళ్ల క్లియరెన్స్ విభాగంలో మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణకు 14వ ర్యాంకు వచ్చింది. దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి 16వ ర్యాంకు వచ్చింది.

గత జూలై నుంచి డిసెంబరు వరకు మంత్రిత్వ శాఖల వారీగా ఫైళ్ల క్లియరెన్స్‌ను ఆధారంగా చేసుకొని ఈ ర్యాంకులను ప్రకటించారు. అయితే ఈ మొదటి ఆరు నెలల కాలంలో ప్రభుత్వ ఏర్పాటు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా చాలా రోజులు వృథా అయ్యాయని, ఆ కారణంగా ఫైళ్ల క్లియరెన్స్‌శాతం తక్కువగా ఉందని మంత్రులు అభిప్రాయపడ్డారు. జనవరి నుంచి ఫైళ్ల క్లియరెన్స్ వేగం పెరిగిందని, 2025 జూన్ నాటికి ఫైళ్ల క్లియరెన్స్ మరింత వేగం పెరుగుతుందని పలువురు మంత్రులు సీఎం దృష్టికి తీసుకువచ్చినట్లు సమాచారం. తొలివిడత ర్యాంకులు జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు గౌరవప్రదమైన స్థానంలో ఉండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌అండ్‌బీ అధికారుల మెడకు ఉచ్చు

- 'ఆంధ్రజ్యోతి' కథనాలపై నివేదిక కోరిన మంత్రి
- బాధ్యుల్లో వణుకు

నెల్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విధానాలను పక్కన పెట్టి కాంట్రాక్టర్లకు అక్రమ మార్గంలో మేలు చేసేలా వ్యవహరిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారుల మెడకు ఉచ్చు బిగుసుకుంటోంది. జిల్లా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి.. 'ఆంధ్రజ్యోతి' కథనాలపై నివేదిక కోరారు. 25 శాతంలోపు పనులు జరిగిన వర్కులను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన తరుణంలో జిల్లా అధికారులు ప్రభుత్వానికి తప్పుడు నివేదిక పంపారు. అయితే అంతకముందే తెప్పించుకున్న నివేదిక ప్రకారం జిల్లాలోని సీఆర్ఐఎఫ్ రోడ్లు 25 శాతం కన్నా తక్కువ జరిగినట్లు నిర్ధారించి వాటిని ప్రభుత్వం రద్దు చేసింది. అయినా నెల్లూరు-మైపాడు రోడ్డు పనులు హడావుడిగా మొదలుపెట్టి చేశారు. బాగున్న రోడ్డును గందరగోళం చేశారు. దీన్ని అడ్డుకోవాల్సిన అధికారులు కూడా కాంట్రాక్టర్‌కు వంత పాడుతూ ప్రభుత్వ ఆదేశాలను పక్కకు నెట్టేశారు. ఇలా ప్రభుత్వ నిర్ణయాలను ధిక్కరిస్తున్నారని గత నవంబరులో 'ఛ.. నిజంగా..' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. 25 శాతంలోపు పనులు జరగని వాటిని కూడా జరిగినట్లుగా చూపించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆ కథనంలో పేర్కొంది. దీనిపై స్పందించిన ఆర్‌అండ్‌బీ మంత్రి కార్యాలయం.. అర్జెంటుగా ఐదు రోజుల్లో నివేదిక ఇవ్వాలని జిల్లా ఆర్‌అండ్‌బీ ఎస్ఈను ఆదేశించింది. అలానే ఆత్మకూరు-సోమశిల రోడ్డు పనులు అత్యంత నాసిరకంగా చేయడంతో సదరు కాంట్రాక్టర్ నుంచిచ రికవరీ చేయాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఆ నివేదికను చాలా కాలం పాటు తొక్కిపెట్టారు. ఈ క్రమంలో గతేడాది నవంబరు 12వ తేదీన 'ఫైలు తొక్కిపెట్టి.. రూ. కోట్లు కొల్లగొట్టి..' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. ప్రజాధనాన్ని లూటీ చేసిన కాంట్రాక్టర్‌ను కాపాడేందుకు అధికారులు విశ్వప్రయత్నాలు చేస్తూ క్వాలిటీ కంట్రోల్ సీఈ నివేదికను తొక్కిపెడుతున్నారన్న విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. అయినా ఆ కాంట్రాక్టర్ నుంచి ఇంత వరకూ రోడ్డు నాసిరకంగా వేసినందుకు రికవరీ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. ఈ వ్యవహారంపై కూడా ఐదు రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ ఆర్‌అండ్‌బీ మంత్రి కార్యాలయం నుంచి ఎస్ఈకు లేఖ రాశారు. ఈ రెండు అంశాలను టాప్ ప్రియారిటీగా భావించాలని ఆ లేఖలో పేర్కొన్నారు. దీంతో బాధ్యులైన అధికారుల్లో వణుకు మొదలైంది.

కుంభమేళాకు పోదాం..!

- ఆర్టీసీ బస్సులకు భలే ఆదరణ
- టికెట్ రూ.9వేలు కావడంతో భక్తుల ఆసక్తి
- రేపు కదిలే బస్సు దాదాపు ఫుల్
- మరికొన్ని సర్వీసులు నడిపే యోచన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాకు వెళ్లాలనుకునే వారికోసం ఆర్టీసీ వేసిన ప్రత్యేక బస్సుకు విశేష స్పందన లభిస్తోంది. జిల్లాలోని భక్తుల సౌకర్యార్థం నెల్లూరు-1వ డిపో అధికారులు శనివారం ఒక బస్సు నడపాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి ముందస్తు రిజర్వేషన్ ప్రకటించిన ఐదు రోజుల్లోనే ఒక బస్సు దాదాపు ఫుల్ కావడంతో మరో బస్సును కూడా నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

● చార్జీలు అందుబాటులో ఉండటం వల్లే..

నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి శనివారం మధ్యాహ్నం 2 గంటలకు కుంభమేళాకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుంది. హైదారాబాద్, నాగపూర్ మీదుగా 9వ తేదీ సాయంత్రానికి కుంభమేళా జరుగుతున్న ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటుందన్నారు. 10వ తేదీ అంతా ప్రయాగ్‌రాజ్‌లోనే ఉండి 11వ తేదీ రాత్రి అయోధ్యకు బస్సు బయలు దేరుతుంది. 12వ తేదీ ఉదయం అయోధ్య చేరుకుని బాల రాముని దర్శించుకున్న తర్వాత అదేరోజు రాత్రి కాశీకి పయనమవుతుంది. 13వ తేదీ కాశీ చేరుకుని అక్కడ బస చేస్తారు. 14వ తేదీ వారణాసి నుంచి బయలుదేరి 15వ తేదీ రాత్రికి నెల్లూరుకు బస్సు చేరుకుంటుంది. ఎనిమిది రోజుల ఈ యాత్రకు ఒకరికి టికెట్టు రూ.9 వేలుగా నిర్ణయించి వసూలు చేస్తున్నారు. ఇది కేవలం బస్ చార్జీ మాత్రమే అని, భోజనం, వసతి సౌకర్యాలను ప్రయాణికులు ఎవరికి వారే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. అయినప్పటికీ ప్రస్తుత రవాణా ఖర్చులతో పోలిస్తే ఆర్టీసీ చార్జీలు తక్కువగా ఉన్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. కాగా, గత నెలలో కుంభమేళాకు పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నెల్లూరు నుంచి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అందులో ఒక టికెట్టు ధర రూ.22 వేలకుపైగా ఉండటంతో ప్రజల నుంచి పెద్దగా ఆదరణ లభించలేదని సమాచారం.

● మరికొన్ని బస్సులు నడిపే దిశగా...

ఆర్టీసీ నెల్లూరు రీజియన్ నుంచి కుంభమేళాకు పలు డిపోల నుంచి మరికొన్ని బస్సులు నడిపేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 26వ తేదీ వరకు కుంభమేళా జరుగుతుండటం, ప్రజల నుంచి స్పందన బాగుండటంతో ఈ నెల 10 తర్వాత అధిక సంఖ్యలో బస్సులు ఏర్పాటు చేసే అవకాశం ఉందని సమాచారం.



విద్యార్థులందరికీ డీవార్మింగ్ తప్పనిసరి

- వారి మానసిక, శారీరక ఆరోగ్యానికి అవి ఎంతో మేలు
- పోస్టర్ల ఆవిష్కరణలో కలెక్టర్ ఆనంద్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యార్థులందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు మింగించాలని కలెక్టర్ ఓ ఆనంద్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నులిపురుగుల నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. 19 ఏళ్లలోపు వయసు ఉన్న ప్రతి విద్యార్థికి ఈ మాత్రలు అందించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులతోపాటు ఆరోగ్య కార్యకర్తలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులకు నులిపురుగుల మందులపై అవగాహన కలిగించాలని పేర్కొన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవటం వల్ల పిల్లల్లో రక్తహీనత తగ్గి, ఆకలి పెరిగి, పోషకాలు మెరుగుపడతాయన్నారు. దీంతో చదువులపై ఆసక్తి పెరుగుతుందని చెప్పారు. శారీరక, మానసిక అభివృద్ధికి కూడా అవకాశం ఉంటుందన్నారు. అనంతరం 'అందరూ భాగస్వాములై పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దాం' అనే నినాదంతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, డీఈవో బాలాజీరావు, సమగ్ర శిక్ష ఏపీవో వెంకటసుబ్బయ్య, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పరిమళ, ఐసీడీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మురల్ ఆర్ట్ మెరిసింది



నెల్లూరు నగరం ఆత్మకూరు బస్టాండు వద్ద ఫ్లైవోవర్ బ్రిడ్జి పిల్లర్లకు వేసిన మురల్ ఆర్ట్ కళకళలాడుతోంది. గత టీడీపీ ప్రభుత్వంలో రకరకాల వృత్తులు, కళాకారులు, ప్రముఖుల చిత్రాలను ఇక్కడ అందంగా ప్రదర్శించారు. అయితే నిర్వహణ లోపంతో ఆ బొమ్మలు దుమ్ముకొట్టుకు పోయాయని ఇటీవల ఆంధ్రజ్యోతి చిత్రమాలికను ప్రచురించింది. దీనికి స్పందించిన యంత్రాంగం మురల్‌ఆర్ట్‌కు కొత్తగా పెయింటింగ్ చేయిస్తోంది. దీంతో ఆ చిత్రాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

- ఫొటో : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

పొద్దున్నే మంచు.. ఆపై మండే ఎండ !

లింగసముద్రం పరిసర గ్రామాల్లో నాలుగైదు రోజుల నుంచి విచిత్ర వాతావరణం పరిస్థితులు నెలకొన్నాయి. వేకువ జామున పొగ మంచు పల్లెలను కమ్మేస్తోంది. ఆ తర్వాత ఎండ మండిపోతోంది. ఇక, రాత్రయితే చలి వణికిస్తోంది. గురువారం వేకువజామున నాలుగు గంటల నుండే దట్టంగా మంచు కురిసింది. తెల్లవారిన తర్వాత కూడా రోడ్లపై 10 అడుగుల దూరంలో ఏముందో కూడా కనిపించనంతగా మంచు తెరలు కప్పేశాయి. ఈ చల్లదనాన్ని ప్రజలు ఆస్వాదిస్తుండగానే భానుడు భగభగమనడంతో అప్పుడే ఎండాకాలం వచ్చేసిందంటూ ఉసూరుమన్నారు.

- లింగసముద్రం (ఆంధ్రజ్యోతి)



వెట్టిచాకిరీ నిర్మూలన
చట్టాలపై అవగాహన అవసరం

● వర్క్‌షాప్‌లో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : వెట్టిచాకిరీ నిర్మూలన చట్టాలపై అధికారులకు అవగాహన అవసరమని కలెక్టర్ ఆనంద్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలోని తిక్కన భవన్‌లో వెట్టిచాకిరీ నిర్మూలన చట్టంపై వర్క్‌షాప్ జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున వెట్టిచా కిరీ నిర్మూలన చట్టాలపై అవగాహన పెం చుకోవాలని సూచించారు. కనీస వేతనం చెల్లించకపోవడమే కాకుండా శారీరక శ్రమను దోచుకోవడం, ఆర్థిక స్వేచ్ఛను హరించడం కూడా వెట్టిచాకిరీ కిందకు వస్తాయని తెలిపారు. వెట్టిచాకిరి వ్యవస్థ లోని కార్మికులను గుర్తించడంలో అధికారు లు ముఖ్య పాత్ర పోషించాలన్నారు ఇందు కు అవసరమైన శిక్షణ జిల్లా స్థాయిలో పొంది తదనంతరం డివిజనల్, మండల స్థాయిలోని అధికారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వెట్టిచాకిరీ కార్మికులను గుర్తించే విధానాన్ని ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ప్రతినిధి గంటా ప్రియాంక పీపీటీ ద్వారా వివరించారు. ఈ వర్క్‌షాపులో అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ ప్రతినిధి షేక్ బషీర్, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఆర్డీవోలు అనూష, పావని, వంశీకృష్ణ, డిప్యూటీ లేబర్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో సుజాత, డీఆర్‌డీఏ, హౌసింగ్ పీడీలు నాగరాజకుమారి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, పక్కన అధికారులు

ఆ.. ఆర్‌ఐలు ఎవరు?

● రహస్యంగా ఆరా తీస్తున్న కమిషనర్, ఏసీబీ?

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థలో పనిచేస్తున్న ఆర్‌ఐల్లో విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్న వారు ఎవరు....? అవినీతి సొమ్ము వసూళ్లకు ఏజెంట్లను పెట్టుకుని దందా చేస్తున్న వారెవరు...? అని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ రహస్యంగా ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆర్‌ఐల అవినీతి బాగోతంపై ఇటీవల ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనికి కమిషనర్ స్పందిస్తూ గోప్యంగా వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఆర్‌ఐల లాగిన్లలో ఫైళ్లు ఎంత కాలంగా పెండింగ్ పెట్టారు...? ఎందుకు పెట్టారు....? ఉన్నత స్థాయికి ఎందుకు పంపలేదు...? అనే కోణాల్లో విచారణ జరుపుతున్నారని, ప్రైవేట్ వ్యక్తులతో రెవెన్యూ పనులు చేయిస్తున్న ఆర్‌ఐలు ఎవరని కూడా ఆరా తీస్తున్నట్లు తెలిసింది. కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధుల నుంచి అందిన ఫిర్యాదులపైనా విచారణకు ఆదేశించారు. కాగా, ఆర్‌ఐల అవినీతి పర్వంపై అవినీతి నిరోధక శాఖ కూడా దృష్టిపెట్టిందని తెలిసింది.

జైకా.. పనులు కాక !

(5వ పేజీ తరువాయి)

పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడమే. సకాలంలో బిల్లులు ఇవ్వని కారణంగా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపలేదు. ఇప్పటి వరకు కాంట్రాక్టర్లకు రూ.14.51 కోట్లు బిల్లులు చెల్లించారు. ఆ బిల్లులు కూడా ఇటీవల కాలంలోనే ఎక్కువగా చెల్లించడం గమనార్హం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జైకా వర్కుల్లో పురోగతి కనిపించింది. అయితే జైకా ఇచ్చిన గడువు ఈ మార్చితో పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం కూడా మార్చిలోపు జైకా వర్కులను పూర్తి చేయాలని ఆదేశించింది. దీనిని ప్రధానాంశంగా తీసుకున్న ఇరిగేషన్ ఎస్‌ఈ దేశనాయక్ బుధవారం అందరు ఈఈలు, డీఈఈలతో సమావేశం నిర్వహించి జైకా పనులపై సమీక్షించారు. రెండు నెలల్లో 60 శాతం పనులు పూర్తి చేయడం సాధ్యపడదు కాబట్టి వీలైనంత ఎక్కువ మేర పనులు పూర్తి చేసేలా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

పనుల్లో వేగం పెంచుతున్నాం

జైకా వర్కులు మార్చిలోపు క్లోజ్ చేయాలని ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో పనులు వేగంగా పూర్తి చేసేలా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నాము. కాంట్రాక్టర్లతో మాట్లాడుతూ పనుల్లో వేగం పెంచుతున్నాం.

- ఇరిగేషన్ ఎస్‌ఈ దేశనాయక్

తల్లిలా ఆలన... తండ్రిలా పాలన





నెల్లూరు నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయం

తల్లిలా ఆలన... తండ్రిలా పాలన చూస్తూ అనాథ పిల్లలకు అక్కున చేర్చుకుని ఆదరిస్తోంది నగరంలోని జనహిత-వాత్సల్య అనాథ శరణాలయం. ఈ సంస్థను 36 సంవత్సరాలనాడు వేదాంతం సంగమేశ్వరశాస్త్రి, పొన్నలూరు సీతారామిరెడ్డి, సామంతు గోపాలరెడ్డి తదితరులు బీవీ నగర్ ప్రాంతంలో ప్రారంభించారు. నాడు చిన్న సంస్థగా ప్రారంభమై నేడు వేలాదిమందికి ఆశ్రయం కల్పించి, వారి ఉన్నతికి బాటలు వేస్తోంది. ప్రతి నెలా రూ.14 లక్షల వరకు ఈ సంస్థ నిర్వహణకు ఖర్చవుతున్నా వెనుకంజ వేయకుండా ఎందరో దాతల సహకారంతో ముందుకు సాగుతోంది.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

అనాథలను అక్కున చేర్చుకున్న వాత్సల్య ● విద్యాబుద్ధులు నేర్పి.. ప్రయోజకులను చేసి ● ఎందరో దాతల సహకారంతో విస్తృత సేవలు

ఈ వాత్సల్యను ప్రారంభించిన వేదాంతం సంఘమేశ్వర శాస్త్రిది గుంటూరు జిల్లా తెనాలి మండలంలోని కుంబవరం అగ్రహారం. 1942లో జన్మించిన ఆయన ఆర్‌ఎస్‌ఎస్ కార్యదర్శిగా పనిచేస్తూ నెల్లూరు విభాగ్ ప్రచారక్‌గా వచ్చారు. ఆ సమయంలో బిచ్చమెత్తుకుంటున్న పిల్లలను చూసి చలించిపోయారు. వారికి అండగా నిలవాలన్న తలంపుతో 1992, జనవరి 26న వాత్సల్య సేవా సంస్థను ప్రారంభించారు. అనాథల కోసం ఆశ్రమ నిర్వహణకు జనహిత ట్రస్టు నెలకొల్పి సన్యాసం స్వీకరించి, వాత్సల్యానంద భారతిగా మారారు. అయితే, 2012లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన తుదిశ్వాస విడిచారు. కానీ వాత్సల్య రూపంలో ఆయన ఆశయం సజీవంగా సాగుతోంది. అనాథల పట్ల ఆయన చూపిన ప్రేమను జనహిత-వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఉన్న జీవీ సాంబశివరావు కొనసాగిస్తున్నారు.



సహచరి పెళ్లిలో వాత్సల్య విద్యార్థినులు

● **నిరాదరణ బాలికలకు అండగా..**

నిరాధార బాలబాలికల కోసం వాత్సల్య పేరిట వసతి గృహం, వృద్ధుల కోసం వానప్రస్థ ఆశ్రమం నడుస్తోంది. ఆధ్యాత్మిక భక్తి భావాలు ఉట్టి పడేలా ప్రసన్నాంజనేయస్వామి ఆలయాన్ని వాత్సల్యలో నిర్మించారు. భారతీయ విద్యా వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌ను స్థాపించి 1 నుంచి 10వ తరగతి వరకు బోధిస్తున్నారు. అలాగే పిల్లల కోసం వేద-సంస్కృత పాఠశాలను కూడా ఏర్పాటు చేశారు. వాత్సల్య శరణాలయంలో ఉన్న విద్యార్థులతోపాటు పేద, బడుగు బలహీన వర్గాల పిల్లలకూ ఉచిత విద్యను అందిస్తున్నారు. వాత్సల్యలో ప్రస్తుతం 85 మంది పిల్లలు ఆశ్రయం పొందుతున్నారు. వీరికి చదువుతోపాటు వేదం, కీబోర్డు, డాన్సు, కోలాటం, భగవద్గీత, కంప్యూటర్‌లో శిక్షణ ఇప్పిస్తున్నారు. అంతేగాక ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఒకేషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు వాత్సల్య నిర్వాహకులు ప్రోత్సహిస్తూ చదివిస్తున్నారు.



కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

● **పెళ్లిపెద్దలుగా మారి..**

వాత్సల్యలో ఆశ్రయం పొంది చదువుకున్న 8 మంది విద్యార్థినులకు వివాహాలు జరిపించింది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాల్లో వాత్సల్య విద్యార్థులు పాల్గొని డాన్సు, కోలాటం, భగవద్గీత, వేదం తదితర పోటీలలో విజేతలుగా నిలిచి ఎన్నో బహుమతులు సాధించారు. క్రికెట్, కబడ్డీ వంటి క్రీడల్లోనూ ఇక్కడున్న పిల్లలు రాణిస్తున్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే సైన్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు రకరకాల మోడల్స్ ప్రదర్శించి అవార్డులు పొందారు.

● **ఉచిత కంప్యూటర్ శిక్షణ**

ఇంటర్ ఆపై చదువులు చదువుకున్న విద్యార్థినులకు వాత్సల్యలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నారు. అదేవిధంగా టైలరింగ్, ఎంబ్రాయిడరీలోనూ ఉచిత శిక్షణ ఇస్తున్నారు. అమెరికాకు చెందిన డాక్టర్ ప్రేమ్ సాగర్‌రెడ్డి హెల్త్‌కేర్ సహకారంతో ఉచిత కంప్యూటర్, టైలరింగ్ శిక్షణను ఏర్పాటు చేశారు.

జీవితంలో స్థిరపడేలా తీర్చిదిద్దుతున్నాం




వాత్సల్యకు ఇతోధికంగా సహకారం అందిస్తూ, ముందుకు నడపడానికి ప్రోత్సహిస్తున్న దాతలందరికీ ధన్యవాదాలు. ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులను కన్న బిడ్డల్లా చూసుకుంటున్నాం. వారికి సంస్కార వంతమైన విద్యాబుద్ధులు నేర్పించి జీవితంలో స్థిరపడేలా చేస్తున్నాం.

- జీవీ సాంబశివరావు, జనహిత-వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి

ఇంటర్ ప్రాక్టికల్స్
పక్కాగా నిర్వహించాలి

● నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : ఆర్‌ఐవో శ్రీనివాసులు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలను జిల్లాలో పక్కాగా నిర్వహించాలని, ఎక్కడైనా అవకతవకలు జరిగినా, సిబ్బంది నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని ఆర్‌ఐవో డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు హెచ్చరించారు. నెల్లూరులోని డీకేడబ్ల్యూ కళాశాలలో గురువారం ఫిజిక్స్, బోటనీ అధ్యాపకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరీక్ష కేంద్రాలన్నింటిలో సదుపాయాలను, సీసీ కెమెరాలను ఎగ్జామినర్లు పరిశీలించి పరీక్షలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. పొరపాట్లు, ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీవీఈవో మధుబాబు, డీఈసీ సభ్యులు దీనదయాళ్, వేణుగోపాల్, కొండయ్య, సబ్జెక్ట్ నిపుణులు గౌస్‌బాషా, ప్రభాకర్, ఆర్‌ఐవో కార్యాలయ సూపరింటెండెంట్ రాజారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌ఐవో శ్రీనివాసులు

ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు 37 మంది గైర్హాజరు

ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు రెండవరోజు గురువారం 37 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షకు 283 మందికి 263 మంది హాజరుకాగా 20 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 277 మందికి 260 మంది హాజరుకాగా 17 మంది గైర్హాజరయ్యారు.

టీకాల అమలుపై సర్వే

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వ్యాధి నిరోధక టీకాల అమలుపై ఈ నెలతోపాటు సెప్టెంబరు నెలలో సర్వే జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత తెలిపారు. టీకాలను పక్కాగా అమలు చేయాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, పర్యవేక్షకులకు వ్యాధినిరోధక టీకాలపై శిక్షణ ఇచ్చారు. గర్భిణులు, రెండు ఏళ్లలోపు పిల్లలు, ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించి వారికి ప్రణాళిక ప్రకారం వ్యాక్సిన్ వేయాలని సూచించారు. గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం సర్వే నిర్వహణకు ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సర్వేలో వ్యాధినిరోధక టీకాల పనితీరును పరిశీలించాలని, వ్యాక్సిన్ వేయని పిల్లలు ఉంటే వారికి టీకాలు వేసేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఈ నెల 10వ తేదీలోపు సర్వే పూర్తి చేయాలన్నారు. సర్వేలో గుర్తించిన చిన్నారుల వివరాలు ఈ నెల 28కల్లా ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సచివాలయం పరిధిలో మైక్రో యాక్షన్ ప్లాన్ మార్చి 5 నాటికి సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, మాస్టర్ ట్రైనర్ డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, ప్రపంచ ఆరోగ్యసంస్థ సర్వైలెన్స్ అధికారి డాక్టర్ మోనికస్టిఫీ, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌వో సుజాత

సోమశిలలో 65.678 టీఎంసీల నిల్వ

అనంతసాగరం ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి గురువారం 1,309 క్యూసెక్కులు ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 65.678 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,750, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

స్ఫూర్తినిస్తున్న 'సక్షమ్' సేవలు

● రక్త, నేత్ర, అవయవదానానికి నిరంతర కృషి
● 20మందితో ప్రారంభమై నేడు 2వేల మందితో...
● ప్రతి ఏటా 10రక్తదాన శిబిరాల ఏర్పాటు
● ఇప్పటివరకు 93కి చేరిన నేత్రదాతలు

కందుకూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రక్తదానం, నేత్రదానం, అవయవ దానానికి కందుకూరులోని సక్షమ్ స్వచ్ఛంద సేవా సంస్థ విశేష కృషి చేస్తోంది. అలాగే వీటిపై ప్రజల్లో అవగాహన పెంపొందించి, వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చేలా చర్యలు తీసుకుంటోంది. మొదట్లో అతికష్టంగా ఈ కార్యక్రమాలను నిర్వహించిన సంక్షమ్ కార్యకర్తలు, నేడు ప్రజల్లో వచ్చిన చైతన్యంతో సులభంగా చేయగలుగుతున్నారు. 38 ఏళ్ల కిందట సేవాభారతి పేరుతో రక్తదాతలను ప్రోత్సహించడం లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టిన చెన్నా రామాంజనేయులు నేడు సక్షమ్ వేదికగా వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మొదట యువకుల సాయంతో 20మంది రక్తదాతలను తయారు చేయగలిగిన ఆయన, నేడు వేలాదిమంది రక్తదాతలను సిద్ధం చేశారు.

● **రెండోదశలో నేత్రదానం**

రక్తదానం విజయవంతం కావటంతో నేత్రదానంపై దృష్టి పెట్టారు. నేత్రదాతలను ప్రోత్సహించటం ప్రారంభించారు. 2007లో అలవల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి కందుకూరులో మొదటి నేత్రదాతగా నిలిచారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 93మంది కందుకూరులో నేత్రదానం చేశారు. గత కొన్నేళ్లుగా నేత్రదానంలోనూ ప్రజల్లో సంపూర్ణ అవగాహన కల్పించడంలో చెన్నా రామాంజనేయులు సఫలీకృతుడయ్యాడు.

● **మూడోదశలో అవయదానం**

నేత్రదాతలు పెరగటంతో ఇప్పుడు సక్షమ్ అవయవదానం, మరణానంతరం దేహదానంపై దృష్టి కేంద్రీకరించారు. ముఖ్యంగా ఎవరైనా బ్రెయిన్‌డెడ్, కోమా కి వెళ్లిన పరిస్థితుల్లోనూ మరణం అంచున ఉన్న వారి కుటుంబసభ్యులను అవయవదానానికి ఒప్పించగలిగితే ఎంతోమంది ప్రాణాలను నిలబెట్టవచ్చన్న లక్ష్యంతో సక్షమ్ కృషిచేస్తోంది. ఇప్పటికే సక్షమ్ ద్వారా వందమందికి పైగా అవయవదానానికి తమ అంగీకారం తెలుపుతూ సమ్మతి పత్రాలపై సంతకాలు చేయించారు.



తలసీమియా బాధిత చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం

● **దివ్యాంగుల సేవలోనూ..**

అన్నీదానాలను విజయవంతంగా పూర్తి చేసిన ఈ సంస్థ నేడు దివ్యాంగులకు సేవచేయడంపై దృష్టి పెట్టింది. దివ్యాంగులను గుర్తించి వారికి ఉన్న లోపాన్ని అధిగమించి మెరుగైన జీవనం సాగించేందుకు అవసరమైన పరికరాలను సమకూరుస్తోంది. కేంద్రం అందజేస్తున్న వివిధ రకాల తోడ్పాటు కార్యక్రమాలపై వారికి అవగాహన కల్పించి, అవసరమైన పరికరాలు తెప్పిస్తోంది. అందులో భాగంగా పలువురికి వీల్‌ఛైర్లు, ట్రై సైకిళ్లు, మోటారు ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు, చేతికర్రలు ఉచితంగా పంపిణీ చేస్తున్నది.

● **ఏటా 10రక్తదాన శిబిరాలు**

సక్షమ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీల ద్వారా కందుకూరులో ప్రతి ఏటా సరాసరి 10కి తక్కువ కాకుండా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నది. గాంధీ, అంబేడ్కర్, ఎన్టీఆర్‌ల జయంతి, ఇతర ముఖ్యమైన పర్వదినాలతో పాటు పోలీసు అమరవీరుల దినోత్సవం, జాతీయ రక్తదాతల దినోత్సవం లాంటి సందర్భాల్లో విధిగా రక్తదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నది. బ్లడ్‌బ్యాంకుల్లో రక్తనిల్వలు తగ్గిన సమయాల్లో కూడా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నది.

● **సొంత ఖర్చులతో వెళ్లి సాయం**

కందుకూరుతోపాటు నెల్లూరు, ఒంగోలు, గుంటూరు తదితర నగరాల్లో ఎవరికైనా అత్యవసరంగా రక్తం అవసరమన్న సమాచారం తెలిసినా.. అరుదైన బ్లడ్‌గ్రూపుల రక్తం అవసరమని వచ్చినా సొంత ఖర్చులతో వెళ్లి రక్తం ఇచ్చి ప్రాణం కాపాడుతున్నారు. ఒకప్పుడు కేవలం 20 మంది రక్తదాతలతో ప్రారంభమై నేడు 2వేల మందికి పైగా పాల్గొంటున్నారంటే అతిశయోక్తి కాదు.



దివ్యాంగురాలికి మోటారు ట్రైసైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు (ఫైల్)

తగినన్ని ఐ బ్యాంకులు లేక సమస్య..



నేత్రదానంపై ప్రజల్లో ఎంతో చైతన్యం వచ్చి.. దాతలు ఉన్నా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతున్నాం. నేత్రదాతలు పెరిగిన మేరకు నేత్రసేకరణ చేసే ఆసుపత్రి పెరగకపోవటం సమస్యగా మారింది. ఓ వ్యక్తి చనిపోయాక 6 నుంచి 8గంటలలోగా కార్నియా సేకరించాలి. అనంతరం 72గంటలలోపు ఆపరేషన్ చేసి కార్నియా అందుడికి అమరిస్తేనే అది ఉపయోగం. కందుకూరు ఏరియా ఆసుపత్రి, ఒంగోలు రిమ్స్‌లో ఐ బ్యాంకు ఏర్పాటు చేసి ఓ వాహనాన్ని, కార్నియా సేకరించే టెక్నీషియన్‌ను ఏర్పాటు చేస్తే ప్రతిఏటా కనీసం వందమంది నేత్రదాతలను సిద్ధం చేయగలం. ప్రస్తుతం పట్టణంలో మాత్రమే నేత్రాలు సేకరిస్తున్నాం. తగిన ప్రోత్సాహం ఉంటే గ్రామాల్లోనూ ఈ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తాం.

- చెన్నా రామాంజనేయులు, సక్షమ్ కార్యదర్శి



మేతపోరంబోకు భూముల్లో సాగించిన తవ్వకాలు

ఉదయగిరి నియోజకవర్గంలో మైనింగ్ మాఫియా పేట్రేగిపోతోంది. విస్తారమైన ఈ ప్రాంత అడవుల్లో ఖనిజ నిక్షేపాలు అధికంగా ఉన్నాయనే ప్రచారంతో కొంతమంది వ్యాపారులు గత ప్రభుత్వ హయాంలో అనుమతులు పొందామంటూ గ్రామాల వైపు పరుగులు తీస్తున్నారు. విషయం తెలుసుకున్న ప్రజలు వ్యాపారులను అడ్డుకొని నిబంధనలకు విరుద్ధంగా పొందిన అనుమతులను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల్లో ఉత్కంఠ పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి.

వదల బొమ్మాళీ వదలా!

● మెట్టలో మైనింగ్ మాఫియా ● ఖనిజ నిక్షేపాల కోసం తవ్వకాలు ● స్థానికులు అడ్డుకుంటున్నా ససేమిరా

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : వరికుంటపాడు మండల కేంద్రానికి కూతవేటు దూరంలోని జంగంరెడ్డిపల్లికి చెందిన సర్వే నెం.233లోని సుమారు 40 ఎకరాల కొండ పోరంబోకు భూముల్లో తవ్వకాలకు అనుమతులు ఉన్నాయని కొంతమంది వ్యాపారులు పనులు చేపట్టేందుకు పూనుకున్నారు. దీంతో విషయం తెలుసుకున్న గ్రామస్థులు మూకుమ్మడిగా అక్కడికి చేరుకొని పనులను అడ్డుకున్నారు. వెనుతిరిగిన వ్యాపారులు పట్టువీడని విక్రమార్కుల్లా మరోమారు అధికారుల సహకారంతో గ్రామానికి చేరుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఆ ప్రాంతాన్ని ఆనుకొని తమ నివాసాలతోపాటు పాఠశాల, ఆలయాలు ఉండడంతో బ్లాస్టింగ్ సమయంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని అధికారులకు విన్నవించారు. మూగజీవాలకు మేత దొరికే పరిస్థితి కూడా లేకుండా పోతుందని వాపోయారు. అలాగే పది రోజుల క్రితం తూర్పురొంపిదొడ్ల గ్రామంలోనూ ప్రజలు ఆందోళనబాట పట్టారు. సర్వే నెం.230-1లోని 9.50 ఎకరాల మేత పోరంబోకు భూముల్లో అర్ధరాత్రిపూట తవ్వకాలు సాగిస్తున్న విషయం తెలుసుకున్న కొంతమంది గ్రామస్థులు అక్కడకు చేరుకొని పనులను అడ్డుకున్నారు. అనంతరం ఆ తవ్వకాలు సాగించిన గుంతలను పూడ్చి వేయడంతోపాటు యంత్రాలు, వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా రహదారికి అడ్డుగా భారీ గుంతను తీసి నిరసన చేపట్టారు. సమీపంలో నివాసాలతో సహా ఆలయ నిర్మాణం జరుగుతున్న తరుణంలో పనులు చేపట్టేందుకు ఒప్పుకొనే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. గతంలో జడదేవి, ధర్మవరం గ్రామాలతో పాటు దుత్తలూరు మండలం లక్ష్మీపురం, సీతారామపురం మండలం సింగారెడ్డిపల్లిలోనూ ప్రజలు అడ్డుకోవడంతో వ్యాపారులు వెనుతిరిగి వెళ్లిన సంఘటనలు ఉన్నాయి.



తూర్పురొంపిదొడ్లలో ఆందోళన చేస్తున్న గ్రామస్థులు (ఫైల్)

● అనుమతులపై విమర్శలు

గత ప్రభుత్వ హయాంలో సమగ్ర విచారణ చేపట్టకుండానే నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు మంజూరు చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా మేత, కొండ పోరంబోకు భూముల్లో ఇచ్చిన అనుమతుల పుణ్యమాని భవిష్యత్తులో పచ్చని ఆ ప్రాంతాలు ఎడారిగా మారే ప్రమాదం ఉంది. మూగజీవాలను నమ్ముకొని జీవనం సాగించే ప్రజలు వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటాయి. అయినా కొంతమంది వ్యాపారులు స్థానికుల అండతో అడ్డుకుంటున్న ప్రజలపై బెదిరింపులకు పాల్పడుతుండడం గమనార్హం. ఇప్పటికే గోరంత అనుమతులు పొందిన కొంతమంది వ్యాపారులు కొండలను గుల్ల చేస్తూ జేబులు నింపుకుంటున్నప్పటికీ పట్టించుకొనే నాథులే కరువయ్యారు. ఇదంతా ఒకవంతైతే కొంతమంది రాజకీయ నాయకుల అండతో తిరిగి తమ వ్యాపారాలను కొనసాగించాలనే సంకల్పంతో వ్యాపారులు తమదైన శైలిలో పావులు కదుపుతున్నట్లు తెలిసింది. అదే జరిగితే పల్లెల్లో ఎలాంటి పరిస్థితులు చోటు చేసుకుంటాయోనని సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

న్యూస్ బాక్స్

9న ఆత్మకూరులో ఐదుగురు మంత్రుల పర్యటన

ఆత్మకూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో ఈనెల 9వ తేదీన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరగనున్నాయని మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆత్మకూరులో పర్యటించనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9:30 గంటలకు ఆత్మకూరు టిడ్కో గృహ సముదాయంలో శ్రీసీతారాముల ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తారని, అలాగే పంచాయతీరాజ్ అతిథిగృహ నిర్మాణానికి శంకుస్థాపన, ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ప్రారంభోత్సవం, నూతన బీసీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల ప్రారంభోత్సవం కార్యక్రమాల్లో వారు పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు బీసీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో విలేకరుల సమావేశం అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తారని ప్రకటనలో పేర్కొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 34 శాతం అభినందనీయం

● బీద రవిచంద్ర

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 34 శాతం కేటాయిస్తూ తీర్మానం చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలకు మొదటిసారి రిజర్వేషన్ ఇచ్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు దక్కగా, స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత చంద్రబాబుకు దక్కిందన్నారు. వారిద్దరి ఆశయాలు, ఆలోచనలతో మంత్రి లోకేష్‌బాబు బీసీల జీవితాల్లో వెలుగు నింపుతున్నారన్నారు. వైసీపీ పాలనలో 136 కులాలకుగాను 56 కార్పొరేషన్లను హడావిడిగా ఏర్పాటు చేసి ఒక్క రూపాయి నిధులను కూడా బీసీలకు కేటాయించలేదని విమర్శించారు.

భార్య పుట్టింటికెళ్లిందని యువకుడి ఆత్మహత్య

కావలి రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భార్య అలిగి పుట్టింటికి వెళ్లిందన్న మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు... కావలి పట్టణం ముసునూరు ఎస్సీ కాలనీకి చెందిన గోళ్ల బ్రహ్మయ్య(26) ఆదే ప్రాంతానికి చెందిన హసినీని నాలుగు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ నెల 5వ తేదీ హసినీ భర్తపై అలిగి పుట్టింటికి వెళ్లింది. భార్య ఇంటికి రాకపోవటంతో మనస్థాపం చెందిన బ్రహ్మయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి శీనయ్య ఫిర్యాదుతో ఎస్ఐ తిరుమల రెడ్డి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గేదెను ఢీకొన్న బైక్

● ముగ్గురికి తీవ్ర గాయాలు

ఉదయగిరి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణ సమీపంలోని 167-బీజీ జాతీయ రహదారిపై గేదెను మోటార్ బైక్ ఢీకొన్న సంఘటనలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలైన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. చెన్నైకు చెందిన డెన్నీస్, ఉదయగిరి పట్టణానికి చెందిన సంతోష్, మహాదేవ్‌లు స్థానిక మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాలలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న తన తాత ఏసు దగ్గరకు వెళ్లారు. అనంతరం మండలంలోని మాసాయిపేట గ్రామంలో జరుగుతున్న ఓ కార్యానికి వెళుతున్న క్రమంలో రహదారిపై గేదె అడ్డురావడంతో దానిని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళు తున్న వారు గమనించి చికిత్స నిమిత్తం వారిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. పోలీసులు వైద్యశాలకు చేరుకొని వివరాలు సేకరించారు.



చికిత్స పొందుతున్న సంతోష్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బ్రాయిలర్ లైవ్	116
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8141
వెండి కిలో ధర	రూ. 98,200
వెండి ఒక గ్రాము	రూ.101.20

నేడు న్యాయవాదులు విధుల బహిష్కరణ

● కర్నూలు బెంచ్‌లో నెల్లూరును కలపడంపై నిరసన

నెల్లూరు (లీగల్), ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 6 : కర్నూలులో త్వరలో ఏర్పాటు చేయనున్న హైకోర్టు బెంచ్‌లో నెల్లూరు జిల్లాను కలుపుతుండ టాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులు బహిష్కరించ నున్నారు. ఈ మేరకు నెల్లూరు బార్ అసోసియేషన్ తీర్మానించింది. గురువారం 'బార్' సర్వసభ్య సమావేశం అసోసియేషన్ హాలులో జరిగింది. నెల్లూరు జిల్లాను కర్నూలు బెంచ్‌లో కలుపడాన్ని పలువురు న్యాయవాదు లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఉదయాన్నే నెల్లూరు నుంచి వెళ్లి అమరావతి లో హైకోర్టు పని పూర్తి చేసుకుని సాయంత్రం జిల్లాకు రావడం న్యాయవాదులుకు సులువుగా ఉందని, అలాంటిది 12 గంటల ప్రయాణం ఉన్న కర్నూలుకు మార్చడం వల్ల న్యాయవాదులు, కక్షిదారులు చాలా ఇబ్బందులు పడుతారని అభిప్రాయడ్డారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం, న్యాయాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలియజేయాలని తీర్మానించారు. ప్రభుత్వం దిగిరాకుంటే భవిష్యత్తులో ఉద్యమించాలని కూడా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీ ఉమామహేశ్వర్ రెడ్డి, పీ సుందరయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాలను నివారించాలి

● మలేరియా అధికారి హుస్సేనమ్మ

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా జ్వరాలను నివారించాలని మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ తెలిపారు. గురువారం నెల్లూరులోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని ,వీటిని దృష్టిలో పెట్టుకుని వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి కొత్త కేసులు నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడేలో గ్రామీణ, పట్టణాలలో పర్యటించి దోమలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బోద వ్యాధిని తప్పని సరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మలేరియా జిల్లా అదనపు వైద్యాధికారి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూముల పరిశీలన

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనియంపాడు గ్రామ సమీపంలోని అగ్రిగోల్డ్ భూముల ను గురువారం సీఐడీ సీఐ వెంకటేశ్వర్లు పరిశీలించారు. తొలుత తహ సీల్దారు కార్యాలయానికి చేరుకున్న ఆయన తహసీల్దారు హేమంత్ కుమార్‌కు పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా లిఖిత పూర్వకంగా నివేదికలు అందజేస్తే సమగ్రంగా సర్వే చేపట్టి భూములను నిర్ధారించ డం జరుగుతుందని తహసీల్దారు విన్నవించారు. అయినప్పటికీ వీఆర్వో ఆంథోనిబాబు, సర్వేయర్లతో అక్కడికి చేరుకొని భూములను పరిశీలించిన అనంతరం లిఖిత పూర్వ కంగా ఎలాంటి నివేదికలు అందజేయకుం డానే వెనుతిరిగి వెళ్లిపోయారు. కాగా, ఆ భూముల్లోని జామాయిల్ చెట్లను నరికి వేసిన తీరుపై పోలీసులతో చర్చించారు. ఇటీవల పలు మీడియాల్లో వరుస కథనా లు వెలువడడంతోనే భూముల పరిశీలనకు వచ్చినట్లు తెలిసింది.



పోటీల ముగింపు సభలో ఉపన్యసిస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు

క్రీడలతో మానసిక ఉల్లాసం

● వీసీ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు అన్నారు. స్థానిక వీఎస్‌యూలో ఇంటర్ - కాలేజియేట్ స్టాఫ్ పురుషులు, మహిళల క్రీడా టోర్నమెంట్ గురువారం ఘనంగా ముగిసింది. ఈసందర్భంగా వివిధ కళాశాలల అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ వీఎస్‌యూలో క్రీడా సంస్కృతిని ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం హనుమారెడ్డి, క్రీడా బోర్డు సెక్రటరీ, టోర్నమెంట్ నిర్వాహకుడు డాక్టర్ సీహెచ్ వెంకట రాయులు, యూనివర్సిటీ పీడీ డాక్టర్ ఏ ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

రైతులందరికీ మద్దతు ధర కల్పిస్తాం : జేసీ



రైతు సంఘాల నాయకులు, రైతుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు (హరనాధపురం) ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వరికోతలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులందరికి మద్దతు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జేసీ కే.కార్తీక్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై రైతు సంఘాల నాయకులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘాల నాయకులు పలు సమస్యలను జేసీ దృష్టికి తీసుకువచ్చారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కల్పించాలని, రైతు సేవా కేంద్రాల్లోనే తేమ శాతం నిర్ధారించి, ఆ ధాన్యాన్ని మిల్లర్లు తీసుకునేలా చూడాలని, లోడింగ్ సమయంలో ఎక్కువసేపు వేచి ఉండకుండా చూడాలని కోరారు. ధాన్యం డబ్బులు కూడా ఆలస్యం లేకుండా వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. గత ప్రభుత్వం హమాలీ, రవాణా ఖర్చులను రైతులకు చెల్లించలేదని, వెంటనే ఆ డబ్బులు చెల్లించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం జేసీ మాట్లాడుతూ రైతులు సూచించిన అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అధికారులు ధాన్యాన్ని పరిశీలించి ధరలను పర్యవేక్షిస్తారన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, సివిల్ సప్లయిస్ డీఎం లక్ష్మీనరసింహారావు, రైతు సంఘ నాయకులు కోటిరెడ్డి, మల్లారెడ్డి, రాధాకృష్ణమనాయుడు, శ్రీనివాసులు, వెంకటరమణయ్య, వెంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బుకోసం తాతపై మనవడి దాడి

● చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తాతపై మనవడు దాడి చేసిన ఘటనలో తీవ్రగాయాలై చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందా డు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని బుజబుజనెల్లూరుకు కృష్ణమూర్తి(68) విశ్రాంత సీఐఎస్ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్. ఆయనకు రవి కుమార్, విజయలక్ష్మి, గీతారాణి అని ముగ్గురు సంతానం. కొంతకాలం కిందట కృష్ణమూరి భార్య వెంకటసుబ్బమ్మ మృతిచెందడంతో అప్పటి నుం చి చిన్నకుమార్తె గీతారాణి కుటుంబంతో కలిసి కృష్ణమూర్తి జీవిస్తున్నారు. గీతారాణి కుమారుడు అనిల్‌సాయి యాక్టింగ్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. మద్యానికి బానిసైన అనిల్‌సాయి సంపాదించినదంతా మద్యం కోసం ఖర్చు చేసేవాడు. అదీచాలక డబ్బుకోసం తాతను ఇబ్బందిపెట్టేవాడు. బుధవారం రాత్రి కూడా పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చి మళ్లీ మద్యం తాగేందుకు నగదు ఇవ్వాలని తాతను ఒత్తిడి చేశాడు. ఆయన ఇవ్వలేదు. ఆ తర్వాత ఇంటి ముందు సిమెంట్ రోడ్డుపై కృష్ణమూర్తి నడుచుకుంటూ వెళుతుండగా తలపై అనిల్‌సాయి బలంగా కొట్టాడు. దీంతో వృద్ధుడు ముందుకుపడి గడ్డం పగిలింది. తీవ్రంగా రక్తస్రావం కావడంతో కుమార్తె, అల్లుడు, మరో మనుమడు భాస్కర్‌సాయి హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమయంగా ఉందని వైద్యులు చెప్పడంతో అక్కడి నుంచి ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మరో వైద్యశాలకు తీసుకెళ్లి తిరిగి మళ్లీ జీజీహెచ్‌కే తీసుకొచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం కృష్ణమూర్తి మృతిచెందారు. తండ్రి మరణానికి కారణమైన అనిల్‌సాయిపై చర్యలు తీసుకోవాలని కృష్ణమూర్తి కుమారుడు రవికుమార్ వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లైంగికదాడిపై విద్యాశాఖ విచారణ

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థినిపై లైంగిక దాడి ఘటన మీద జిల్లా విద్యాశాఖ విచారణకు ఆదేశించింది. డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు ఆదేశాల మేరకు ఆత్మకూరు-కందుకూరు డివిజన్ల డిప్యూటీ ఈవో జానకిరామ్ గురువారం నెల్లూరులోని సంతపేటలో ఉన్న ఓ ప్రభుత్వ పాఠశాలలో విచారణ చేపట్టారు. పాఠశాలలో చదువుకుంటున్న బాలికపై అదే పాఠశాలలో పనిచేస్తున్న అటెండర్ లైంగిక దాడికి పాల్పడినట్లు జోరుగా ప్రచారం జరుగడం, విషయం బాలిక కుటుంబ సభ్యులకు తెలియడంతో పాఠశాలకు చేరుకున్న తల్లిదండ్రులు అటెండర్‌కు దేహశుద్ధి చేసిన విషయాలపై ఆయన ఆరా తీశారు. అయితే అలాంటి ఘటన ఏమీ జరగలేదని పాఠశాల హెచ్‌ఎం, సిబ్బంది లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. కాగా, లైంగిక దాడి ఘటన బయటకు పొక్కకుండా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది కలిసి బాలిక తల్లిదండ్రులతో రాజీ కుదుర్చుకున్నట్లు వస్తున్న వార్తలో ఉన్న వాస్తవంపై వారితో విచారణ అధికారి సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. ఈ వ్యవహారం బయటకు రావడంతో, ఆరోపణలు ఎదుర్కొంటున్న అటెండర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారన్న దానిపై హెచ్‌ఎంను, సిబ్బందిని ప్రశ్నించగా అటెండర్ వ్యక్తిగత కారణాలతో సెలవులో ఉన్నారని తెలియచేసినట్లు సమాచారం. దీనిపై విద్యాశాఖ అధికారులను ప్రశ్నించగా లైంగికదాడి ఘటనకు సంబంధించిన విచారణలో ఎలాంటి విషయాలు లేవని, పాఠశాలలో అంతా సవ్యంగానే ఉన్నట్లు తమకు నివేదికలు అందాయని తెలిపారు. మరింత లోతుగా విచారణ చేపట్టిన అనంతరం పూర్తి వివరాలు తెలియచేస్తామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కి గాయాలు

వెంకటాచలం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొలగమూడి క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై గురువారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... నెల్లూరు నుంచి గూడూరు వైపు వెళ్తున్న లారీ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న మినీ లారీ ఢీకొని చెట్లలోకి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో మినీ వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మినీ వ్యాన్ ముందు భాగం దెబ్బతింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



షేక్ దిల్‌షా మృతదేహం



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వ్యవసాయ కూలీల ఆటోను ఢీకొట్టిన ట్రాక్టరు

● వెలిగండ్ల అడ్డరోడ్డులో ప్రమాదం ● ఒకరి మృతి.. ఐదుగురికి తీవ్రగాయాలు

కొండాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కొండాపురం మండలం వెలిగండ్ల సమీపంలో వ్యవసాయ పనుల కోసం 8మంది కూలీలతో వెళ్తున్న ఆటోను గురువారం ట్రాక్టరు ఢీకొట్టిన ఘటనలో ఒక మహిళ మృతి చెందడంతో పాటు ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ ఎం వెంకటరావు తెలిపిన వివరాల మేరకు.. వ్యవసాయ పనుల నిమిత్తం గరిమెనపెంట నుంచి ఆటోలో బసిరెడ్డిపల్లె నుంచి వెళుతుండగా వెలిగండ్ల అడ్డరోడ్డులో అటుగా వస్తున్న ట్రాక్టరు ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన షేక్ దిల్‌కుషా (40) అనే మహిళను స్థానికులు 108లో కావలికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. లక్ష్మ మ్మ అనే మహిళకు కాలు విరిగింది. రజియాబేగం, జయలక్ష్మి, పద్మ, లక్ష్మీదేవి గాయాలయ్యాయి. దిల్ కుషా మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటరావు తెలిపారు.

● ఎమ్మెల్యే కాకర్ల పరామర్శ

విషయం తెలుసుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కావలి ప్రవేటు వైద్యశాలకు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఏరియా వైద్యశాలకు వెళ్లి మృతిచెందిన దిల్‌కుషా కుటుంబసభ్యులను పరామర్శించి తక్షణ సహాయంగా ట్రస్టు తరఫున రూ.20 వేలు అందజేశారు. ఆయన వెంట టీడీపీ మండల నాయకులు పోలినేని చంద్రబాబునాయుడు, దాసరి అశోక్, జాగర్లమూడి శ్రీనివాసులు, కిలారి నరేంద్ర, అల్లిక మధు ఉన్నారు.

గంజాయి అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు

ఐదుగురి అరెస్ట్

ఆత్మకూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో గతకొంత కాలం నుంచి గంజాయి అక్రమ రవాణా సాగిస్తున్న ముఠాను జిల్లా ఎస్పీ జి కృష్ణకాంత్ ఆదేశాల మేరకు డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో సీఐ గంగాధర్ స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి చాకచక్యంగా పట్టుకున్నారు. ఈమేరకు డీఎస్పీ గురువారం విలేఖర్ల సమావేశంలో వెల్లడించారు. స్పెషల్ టీమ్‌కు అందిన సమాచారం మేరకు బుధవారం ఆత్మకూరులోని పంటవీధి పొలాలలో గల పాడుబడిన శ్రీనివాస స్కూల్ ఆవరణలో గంజాయి తాగుతున్నట్లు సమాచారం రావడంతో సీఐ గంగాధర్, ఎస్ఐలు జిల్లాని, సాయిప్రసాద్‌లు తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో షేక్ చిన్న బాదుల్లా, షేక్ సుబహాని, పొన్నపురెడ్డి తరుణ్, షేక్ మౌలాలి, పల్లా మాలకొండారెడ్డి అనే ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఒకరిది ఏయస్‌పేట మండలం హసనాపురం, మరొకరిది కలిగిరి మండలంలోని కాకుటూరు, ఆత్మకూరులోని ఎల్ఆర్‌పల్లి, ఇద్దరిది నెల్లూరు కిసాన్ నగర్‌గా గుర్తించామని డీఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి 5 గ్రాములు ఉన్న 13 ప్యాకెట్ల గంజాయి, 5 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీని విలువ సుమారు ఒక లక్ష రూపాయలు ఉంటుందని తెలిపారు. ఏఎస్ పేటకు చెందిన సయ్యద్ అబ్దుల్ మీరామొహిద్దీన్ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. కాగా, గంజాయి ముఠా గుట్టురట్టు చేసిన స్పెషల్ టీమ్ సీఐ గంగాధర్, ఎస్ఐలు జిలాని, సాయిప్రసాద్, పీసీలు, మహిళా పీసీలను డీఎస్పీ అభినందించారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్, పక్కన ఇన్‌స్పెక్టర్లు

వీరు..గిరి'జనం' కాదా?

- కావలి గిరిజన కాలనీల్లో మౌలిక వసతుల కరువు
- ఇబ్బందుల మధ్య కాలం వెళ్లదీత ● పట్టించుకోని అధికారులు

కావలి టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):గిరిజనుల అభివృద్ధే ధ్యేయమని గిరిజనుల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని నాయకులు ఇస్తున్న హామీలు కేవలం ఎన్నికల ప్రచారానికే పరిమితం అవుతున్నాయే తప్ప వారి బతుకులు మాత్రం ఏమాత్రం మారడం లేదు. గిరిజనుల నివసించే ప్రాంతాలు.. కాలనీలను చూస్తే ఆ విషయం అర్థం అవుతుంది. పట్టణంలోని 5, 16వ వార్డుల్లో గిరిజనులు ఎక్కువగా ఉన్నారు. ఈ వార్డుల్లో ఇప్పటికీ సీసీ రోడ్లు, డ్రైనేజీ, నీటి వసతి లేదు. వీరి అభివృద్ధికి ఏర్పాటు చేసిన ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పడుతుండటంతో వారు కూలీలుగానే మిగిలిపోతున్నారు.

● మౌలిక వసతులు కరువు

మట్టిరోడ్లు కావడంతో నాలుగు చినుకులు పడితే చిత్తడిగా మారి నడవ లేని పరిస్థితి ఉంటుంది. డ్రైనేజీలు లేకపోవడంతో నివాసాల మధ్యే మురు గునీరు నిల్వ చేరి దుర్గంధం వస్తుంది. వీధిలైట్లు లేకపోవడంతో రాత్రయితే విష పురుగులు బెడద ఎక్కువగా ఉంటుంది. అలాగే తాగునీటి వసతి కూడా ఉండదు. గతంలో వేసిన రెండు బోర్లు చెడిపోయినా పట్టించు కోవడం లేదు. నీటికోసం వ్యవసాయం బావులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉం ది. దీనికితోడు వీరికి ఎలాంటి ఉపాధి అవకాశాలు లేక పోవడంతో కూలీలుగానే మిగిలిపోతున్నారు.

సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పడుతున్నాయి

- మొగలి కల్లయ్య, ఏపీ ఎరుకల, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఏర్పడ్డ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పడుతున్నాయి. ఈ నిధులు గిరిజనేతరుల ప్రాంతాలకు మళ్లిస్తూ పక్కదారి పడుతున్నాయి. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు గిరిజన ప్రాంతాలకే వినియోగించాలి. అధికారులు స్పందించి గతంలో గిరిజన అభివృద్ధి, సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలన్నీ అమలు చేయాలి.



ముసునూరు గిరిజన కాలనీలోని మట్టిరోడ్డు

రూ.1.60కోట్లతో సీసీ రోడ్డు పనులు

- ఇందిరమ్మ కాలనీలో వర్కులు
- నిర్మాణం కోసం ఆక్రమణల తొలగింపునకు చర్యలు

కావలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక 16వ వార్డుపరిధిలోని కొత్త శివాలయం నుంచి గురురాఘవేంద్ర కాలనీని రైల్వే అండర్‌పాస్ వంతెన వరకు 1.5కిలోమీటర్లు మేరక సీసీ రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. పనులు చేపట్టేందుకు రూ.1.60 కోట్లు మం జూరయ్యాయి.. వర్షం పడితే ఇక్కడ స్థానికులు పడే ఇబ్బందులను కొందరు స్థానిక నాయకులు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు.

రోడ్డు వెడల్పునకు చర్యలు

ప్రధానరోడ్డును 6మీటర్ల వెడల్పుగా మార్చేందుకు అధికారులు సిద్ధం అయ్యారు. అందులో భాగంగా రోడ్డు ఉండే వరకు మార్కింగ్ వేశారు. గురువారం చేపట్టిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, టీపీవో వివేకానంద, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. కొత్త శివాలయం నుంచి 108కాలనీ వరకు రోడ్డు ఆక్రమణలకు గురికావటంతో ఆ ప్రాంతంలో కొన్నిచోట్ల, 5మీటర్లు, మరికొన్ని చోట్ల 4మీ వెడల్పున రోడ్డు వేసేలా చిన్న ఆక్రమణలను తొలగింపునకు చర్యలు చేట్టారు. ఆక్రమణల్లో ఇళ్ల జోలికి వెళ్లకుండా అడ్డుగా ఉన్న ప్రహరీలు తొలగించాలని చెప్పారు. తొలగింపులో ఎవరైనా మరీ పేదలు ఉంటే వారికి ఎక్కడైనా ప్రత్యమ్నాయంగా స్థలం చూపిస్తామని తెలిపారు. ఈ రోడ్డు వేసేందుకు మార్కింగ్ చేస్తూ డిజైన్ రూపొందిస్తు న్నారు. ఆక్రమణలు తొలగింపు పూర్తయిన వెంట నే నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టేందుకు అధి కారులు సిద్ధం అవుతున్నారు.



కొలతలు వేస్తున్న మున్సిపల్ అధికారులు

భక్తిశ్రద్ధలతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- సింహ వాహన సేవలందుకున్న వేంకటేశ్వరుడు

కావలి టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రంకురోడ్డు వద్ద నున్న హనుమత్‌క్షేత్ర లక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపక ప్రధాన అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు పర్యవేక్షణలో జరుగుతున్న ఉత్సవాల్లో స్థానిక వెంగళరావునగర్‌లో శ్రీవారు సింహ వాహనంపై భక్తులకు దర్శ నమిచ్చారు. అడుగడునా భక్తజనం దర్శించు కుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం తోమల సేవ, హోమం, ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ముందుగా ముసునూరు అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు నివాసం వద్ద కళాకారులు వివిధ వేషాధారణలో ప్రదర్శనతో ఇచ్చారు. శుక్రవారం శ్రీవారికి హనుమంత వాహ న సేవలందించనున్నారు.



సింహ వాహనంపై వేంకటేశ్వరస్వామి

6కెడికె1 సదుపాయాలపై ప్రజంటేషన్ ఇస్తున్న ప్రిన్సిపాల్ రవికుమార్

టీఆర్‌ఆర్‌లో ఘనగా ఓపెన్ డే

కందుకూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఓపెన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ఇతర జూనియర్ కాలేజీలు, పొన్నలూరు, సింగరాయకొండ, టంగుటూరు, వలేటివారిపాలెం జూనియర్ కాలేజీలు, చుండి మోడల్ స్కూల్ విద్యారులు, అధ్యాపకులను కళాశాలకు ఆహ్వానించి మౌలిక సదుపాయాలు, విద్యార్థుల

ప్రాథమిక విద్యను బలహీనపరిచే చర్యలు ఆపాలి



చిట్టగుంట: ఎంఈవోలతో మాట్లాడుతున్న కదనూతల దళితులు



అనంతసాగరం: ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యను బలహీనపరిచే చర్యలను ఆపాలని యూటీఎఫ్ మాజీ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు లక్కు. కృష్ణప్రసాద్ కో రారు. గురువారం పట్టణంలోని ఆదిఆంధ్ర ప్రాథమిక పాఠశాలలో పేరెంట్స్ కమిటీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని 3,4,5 తరగతుల విద్యార్థులను పట్టణంలోని ఎల్ఆర్ పల్లి ప్రాథమిక పాఠశాలలో విలీనం చేసేందుకు ఎంఈవో పేరెంట్స్ కమిటీ అనుమతి కోరారన్నారు. కానీ విద్యార్థులు పట్టణంలోని ప్రధాన రహదారి వెంబడి ప్రతిరోజు కిలోమీటరుకుపైగా నడిచి ఎల్ఆర్ పల్లి పాఠశాలకు పంపడం ప్రమాదం కొనితెచ్చుకున్నట్లేనని పేరెంట్స్ కమిటీ ఏకగ్రీవంగా వ్యతిరేకిస్తూ తీర్మానించారని పేర్కొన్నారు. కావున ఆది అంధ్ర పాఠశాలను విలీనం చేసే ప్రక్రియను ఆపాలని కోరారు.

● చిట్టగుంట: దళితవాడ ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతుల విద్యార్థులను వేరే పాఠశాలలోకి విలీనం చేయాలన్న అధికారుల ప్రయత్నాలను ఉప సంహరించుకోవాలని గ్రామస్థులు ఎంఈవోలు నరసింహారావు, జయమ్మలను కోరారు. ఈ విషయంపై వారు మండల విద్యా వనరులకేంద్రానికి పెద్ద సంఖ్యలో వెళ్లి విన తిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యాకమి టీ చైర్మన్ నక్కాప్రసున్న, దాసరి బాబురావు, పత్రి రవి, గోపీకృష్ణ, సునీల్, శ్రీను ఉన్నారు.

● ఉదయగిరి: తిరుమలాపురం ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 3,4,5 తరగతులు చదివే తమ పిల్లలను దుంపవారిపల్లి ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయవద్దని పీఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవో-2 శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో పాఠశాల ఉంటే తమ పిల్లలు అక్కడికెళ్లి చదువుకుంటారని, విలీనం చేస్తే విద్యకు దూరమవుతారన్నారు. పీఎంసీ తీర్మానం చేసి అక్కడే ఆయా తరగతులు కొనసాగేలా చర్యలు చేపట్టాలని, లేదంటే ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. స్పందించిన ఎంఈవో మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు.

● కలువాయి: మోడల్ ప్రైమరీ పాఠశాలలో 3,4,5 తరగతులను కలిపే ప్రతిపాదనలకు నిరసనగా మండల కేంద్రంలోని పలు పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు వెస్ట్ ప్రాథమిక పాఠశాల ముందు ఆందోళన చేశారు. బస్టాండు సమీపంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలకు పిల్లలను పంపడం కష్టమని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్న పాఠశాలలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే కలువాయి గిరిజన కాలనీ వాసులు కూడా అక్కడకు చేరుకుని ఆందోళనకు దిగారు. తమ కాలనీలోని పాఠశాలలో ఉండే 3,4,5 తరగతులను తరలించవద్దని ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. పెన్నబద్వేలిలో యూపీ పాఠశాల విద్యార్థులను జడ్పీ ఉన్నత పాఠశాలలో కలపడంపై ఆందోళన చేస్తూ ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఎంఈవో రేణుకకు వినతి పత్రం అందజేశారు.

● అనంతసాగరం: ముత్తుకూరు, గార్లదిన్నెపాడు ప్రాథమిక పాఠశాలల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. తమ పిల్లలను పాతదేవరాయపల్లిలో మోడల్ స్కూల్‌కు విలీనం చేసే ప్రక్రియ జరుగుతుందని, ఈక్రమంలో విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని, అధికారులు ఆ ప్రయత్నం విరమించుకోవాలని కోరారు.



ఆత్మకూరు: ఆది ఆంధ్ర పాఠశాల వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



ఉదయగిరి: ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీ కాలనీ వాసులు

120రోజుల ప్రణాళికతో వందశాతం ఫలితాలు

- జీ.సురేష్, కలిగిరి ఎం.ఈ.వో



కలిగిరి, ఫిబ్రవరి 6,(ఆంధ్ర జ్యోతి): మండలంలో ఇప్పటివరకు 90శాతం మేర అపార్ నమోదు పూర్తయిందని మండల ఎంఈఓ జి.సురేష్ తెలిపారు. కాంపోనెంట్ నిధులతో పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాలు చేపడతామన్నారు. 120రోజుల ప్రణాళికతో పదిలో వందశాతం ఫలితాలు సాధించే చర్యలు తీసుకున్నట్లు ్ల చెప్పారు.

ఈ వారం ఇంటర్వ్యూ

? అపార్ నమోదు ఎంతవరకొచ్చింది.

! ఇప్పటివరకు 85శాతం పూర్తయింది. మిగిలిన వారికి ఆధార్‌కార్డు లేక, వివరా లు తప్పుగా నమోదవడంతో జాప్యం జరుగుతోంది. వాటిని సరిచేసి వందశాతం పూర్తి చేస్తాం.

? మధ్యాహ్న భోజనం అమలెలా ఉంది.

! అన్నిపాఠశాలల్లో నిర్దేశించిన మెనూ ప్రకారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతోంది.

? సాయంత్రం స్టడీ అవర్‌లో అల్పాహారం ఇస్తున్నారా.

! దాతలు ముందుకొచ్చి సహాయం అందిస్తే అల్పాహారం అందజేస్తున్నాం.

? 120రోజుల ప్రణాళిక ఎలా అమలవుతోంది.

! ఈ ప్రణాళికను ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. అందుకు తగ్గట్టుగా వారు చర్యలు తీసుకున్నారు. విద్యార్థుల ప్రగతి మెరుగవుతుంది.

? కాంపోనెంట్ నిధులతో ఏ పనులు చేస్తున్నారు.

! వచ్చిన కాంపోనెంట్ నిధులతో మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుత్ బిల్లుల చెల్లింపు, ఉపకరణాల కొనుగోలు చేస్తున్నాం.

మరమ్మతు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):స్థానిక 31వ వార్డులోని పెద్దపవని రోడ్డులో ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు ఎదురుగా మరమ్మ తులకు గురైన మంచినీటి పైపులైన్‌ను గురు వారం మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. గురువారం ఇంజనీరింగ్ సిబ్బంది పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. మరలా లీకేజీతో అవడంతో కమిషనర్ దగ్గరుండి పనులను పరిశీలించారు. శుక్రవారం వైకుంఠపురం, పెంకులఫ్యాక్టరీ గిరిజన కాలనీ, నార్త్ జనతాపేట ప్రాంతాలకు మంచి నీటి సరఫరా పునరుద్ధరణ చేపట్టారు.

పాఠశాలలో కుక్కల బెడద

లింగసముద్రం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలోని వాకమళ్లవారిపాలెం పాఠశాల వద్ద కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఇవి ఈ పాఠశాల వద్ద ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయాం దోళనకు గురి చేస్తుంది. వాహనాల్లో వెళుతున్న వారిని, పాదచారులను కరుస్తున్నాయి.

విద్యుత్ మొండి బకాయిలు వసూలు చేయండి

ఉదయగిరి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అన్ని కేటగిరిలకు సంబంధించిన విద్యుత్ మొండి బకాయిలను త్వరితగతిన వసూలుచేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ సూచించారు. గురువారం ఉదయగిరి పట్టణంలోని ఈఆర్వో కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై విస్తృతంగా అవగాహన కల్పించి ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ ఎస్టీలకు సంబంధించి 200 యూనిట్ల కంటే అదనంగా వాడిన బకాయిలను సైతం వసూలు చేయాలన్నారు. అనంతరం సంబంధిత రికార్డులను తనిఖీ చేసి సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాసులు, ఏఈలు ఖుద్దూస్‌బాషా, శ్రీహరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

అన్నవరం ఎస్టీకాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం

జలదంకి, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): అన్నవరం ఎస్టీ కాలనీలో రూ.10లక్షల ఉపాధి నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణం పనులను గురువారం టీడీపీ నేతలు పూనూరు భాస్కర్‌రెడ్డి, చైత న్యరెడ్డిలు ప్రారంభించారు. ఎన్నికల ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రోడ్లు మంజూరు చేయించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మధురెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

సముద్రాల కుటుంబానికి నేతల పరామర్శ

బిట్రగుంట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అల్లిమడుగు సంఘంకు చెందిన గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సముద్రాల దావీదు సోదరుడు సముద్రాల నాని ఇటీవల మృతి చెందారు. గురువారం పలువరు నేతలు స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి నాని చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కావలి ప్రముఖ వైద్యులు ప్రభాకర్‌నాయుడు, మన్నవ రవిచంద్ర, మామిడాలమధు, బచ్చుమధుసూదన్, రాష్ట్ర గిరిజన నేతలు పాలకీర్తిరవి, బాపట్ల వెంకటపతి, తుమ్మ మస్తాన్, జిల్లా గిరిజన నేత బోగిరి ప్రభాకర్ ఉన్నారు.



పాల్గొన్న నేతలు

యానాదుల సమస్యల పరిష్కారానికి కృషి

ఉదయగిరి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): యానాదుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య పేర్కొన్నారు. గురువారం యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బ్రందం మండలంలోని కొత్తపల్లి యానాది కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేయాలని, భూపట్టాలు ఇచ్చినా హద్దులు చూపలేదని, ఆర్ అండ్ బీ స్థలాల్లో ని వాసం ఉంటున్న తమను ఖాళీ చేయాలని అధికారులు బెదిరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య, తలశిల చంద్రమౌళి, సీహెచ్‌ఉష, టీ సతీష్‌చంద్ర పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

పారిశుధ్యం, చోరీల నివారణపై అవగాహన

చేజర్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చేజర్ల ఎస్ఐ తిరుమలరావు గురువారం మండలంలోని ఆదురుపల్లి గ్రామంలో వ్యాపారులకు పారిశుధ్యం, చోరీల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ తిరుమలరావు మాట్లాడుతూ గ్రామంలో దుకాణాల వద్ద చెత్తా చెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా తమ దుకాణంలో సిసి కెమేరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డి రామయ్య మాట్లాడుతూ దుకాణాల ముందు చెత్త వేసినా, ఇంట్లో మురుగునీరు రోడ్డు మీదకు వదిలినా జరిమానా విధిస్తామని, అయినప్పటికీ ఎవరైనా నియమాలను ఉల్లంఘిస్తే పోలీసులకు సమాచారం ఇచ్చి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యాపారులు స్థానికులు పాల్గొన్నారు.

ప్రతి పనికీ వీఆర్వోల రేటు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల వీఆర్వోలు ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి అందికాడికి ప్రజల నుంచి దోచుకుంటున్నారు.15 సచివాలయాల్లో 8మంది వీఆర్వోలున్నారు. ఒ క్కో వీఆర్వోకు ఉన్నతాధికారులు రెండు సచి వాలయాల బాధ్యతలను అప్పగించారు. అ యితే ఇప్పుడు కాకపోతే ఎప్పుడు సంపాదిం చాలనే ఉద్దేశ్యమో తెలియదు కానీ వారు అ డిగినంత ఇస్తేనే ఫైలు కదులుతుంది. లేదంటే ఫైలు కదలదు. ఎందుకివ్వాలని రూల్స్ మాట్లాడితే అది లేదు...ఇది లేదు అంటూ సవాలక్ష కొర్రీలు వేస్తున్నారు. ఫైలు నెలలు త రబడి వీఆర్వోల దగ్గరే ఉండి పోతుంది. వారి మాట వింటే క్షణాల్లో పని అయిపోతుంది. చేసేది లేక అడిగినంత ఇచ్చి నగదు ఇచ్చి పనులు చేసుకుంటున్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ విన్నర్‌గా మణికంఠ

కావలి టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విక్రమసింహపురి యూనివర్సిటీ స్టాఫ్ అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో కావలి పీజీ కళాశాల పీడీ సీహెచ్ మణికంఠ షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ సింగిల్స్ చాంపియన్‌గా నిలిచాడు. టీటీ డబుల్స్‌లో మణికంఠ, సుదీప్ జట్టు విన్నర్స్‌గా బ్యాడ్మింటన్ డబుల్స్‌లో రన్నర్స్‌గా నిలిచారు. గురువారం వీఎస్‌యూలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వైస్ చాన్స్‌లర్ ఆచార్య భాస్కరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ సునీత, మణికంఠ సుదీప్‌లకు అభినందనలు తెలిపారు.



పాఠశాలను పిల్లలకు అందుబాటులో ఉంచాలి

వింజమూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాలను పిల్లలకు అందుబాటులో ఉంచాలని గ్రామస్థులు కోరారు. గురువారం మండలంలోని నల్లగొండ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని చౌటపల్లి ప్రాథమిక పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం జరిగింది. చైర్మన్ లక్ష్మీదేవి అధ్యక్షత వహించగా సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తమ పాఠశాలను మూత వేయకుండా 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు కొనసాగించాలని వినతిపత్రం ప్రధానోపాధ్యాయులకు సమర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డీపీ నర్సింహాలు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

● కలువాయి: నాణ్యమైన విద్యను అందించాలన్న ప్రభుత్వ ఉద్దేశాన్ని తల్లిదండ్రులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులకు తెలియజేసి మోడల్ ప్రైమరీ పాఠశాలలకు వారి పిల్లలను పంపించేందుకు ఒప్పించాలని కలువాయి ఎంఈవో-1 రేణుక ఉపాధ్యాయులకు సూచించారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల ప్రతిపాదనలపై గురువారం ఉపాధ్యాయులతో విద్యాశాఖ అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఒక తరగతికి ఒక టీచర్ బోధిస్తారని దీంతో పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులక అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంఈవో-2 శేషగిరిరావు పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయులకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొండాపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద మండలంలో నూతనంగా చేపట్టిన పనులకు విద్యుత్ సరపరా పనుల కోసం శుక్రవారం కొండాపురం సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరపరా నిలిపివేస్తున్నట్లు గురువారం ఇన్‌చార్జి ట్రాన్స్‌కో ఏఈ దినేష్ తెలిపారు. అలాగే కొమ్మి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8-30గంటల నుంచి 10-30గంటల వరకు విద్యుత్ సరపరా ఉండదన్నారు.

బీసీ వెల్ఫేర్ అధికారులకు సత్కారం



సత్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు

కావలి టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బీసీ వెల్ఫేర్ అధికారులుగా పదోన్నతులు పొందిన సాల్మన్‌రాజ్, నరసింహులును గురువారం వెంగళరావునగర్‌లోని సంయుక్త సంస్థ కార్యాలయంలో సురేంద్ర అధ్యక్షతన స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రవికుమార్, స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాష, ప్రసాదరావు, అజిత్‌బాబు పాల్గొన్నారు.

బీసీలకు 34శాతంపై హర్షం

ఉలవపాడు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్ కేటాయిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై నెల్లూరు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి అమ్మనబ్రోలు రమేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి రాష్ట్ర బీసీల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీసీలను ఓటు బ్యాంక్‌లా చూడకుండా వారికి రాజకీయ, ఆర్థిక, సామాజిక లబ్ధి చేకూరేలా రిజర్వేషన్ అమలు చేస్తామని యువగళం పాదయాత్రలో మంత్రి లోకేష్ ఇచ్చిన హామీని నిలపెట్టుకున్నారని గుర్తుచేశారు.

వైసీపీ అభివృద్ధికి కృషి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తొడుగుపల్లి మానం మస్తానయ్య వైసీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. గురువారం ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తన ఎంపికకు కృషి చేసిన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు మేకపాటి అభినవ్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు.

రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వర్లు

దుత్తలూరు(ఉదయగిరి), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ కార్పొరేషన్ రాయితీ రుణాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ సీనియర్ సహాయకులు అలేఖ్యతో కలిసి పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. అర్హులు 7వ తేదీలోపు ఓబీఎం ఎస్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయ న కోరారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

సంగం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక కొండ రహదారి కూడలిలో సీఐ వేమారెడ్డి ట్రాక్టర్ డ్రైవర్లకు గురువారం రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. రాత్రి వేళ్లలో ప్రమాదాలు జరగకుండా ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అంటించాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎస్ఐ రాజేష్ ఉన్నారు.

పీఫోర్ సర్వే పరిశీలన

సీతారామపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలో గురువారం పిఫోర్ సర్వేను ఏపి ఎస్‌బిపిఎస్ యంగ్ ప్రొఫెసర్ వెంకటేష్ పరిశీలించారు. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద నాలుగు ప్రాంతాలను పిఫోర్ సర్వేకు ఎంపిక చేయడం జరిగిందని వాటిలో సీతారామపురం ఒకటన్నారు. బిట్ -1,బిట్ -2 సచివాలయ పరిధిలోని 2195 కుటుంబాలపై చేపడుతున్న సర్వేలో ప్రజల ఎకనామిక్ గ్రోత్ ఎలా ఉంది అని ఆరా తీశారు. ఎన్యుమెటర్ లు సర్వేను పక్కడ్బందీగా నిర్వహించి వివరాలను ఆన్లైన్ చేయాలని తెలిపారు. సర్వేను ఈ నెల 9వ తేదీలోపు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అత్మకూరు డిప్యుటీ సురేష్, ఎఎస్ఓ కుమార్, ఈవోపీఆర్డీ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో విద్యార్థులు ఎదగాలి



సత్కారం అందుకున్న విద్యార్థులతో అతిథులు, కళాశాల ప్రతినిధులు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందరూ గర్వించే స్థాయికి ఎదగాలని వీఎస్‌యూ వీసీ ఆచార్య విజయభాస్కర్‌రావు అన్నారు. నగరంలోని అనీల్‌గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన కృష్ణచైతన్య జూనియర్ కళాశాలల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి కూడా తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. జీవితంలో ఏదైనా సాధించాలంటే పట్టుదల ఉండాలని, విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికా బద్ధంగా విద్యలో రాణిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. మరో ముఖ్య అతిథి, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎంతోమంది మహనీయులకు నెల్లూరుజిల్లా నిలయమన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులందరూ కూడా తల్లిదండ్రులు గర్వించేస్థాయికి ఎదగాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం కళాశాలలో వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మెమెంటోలు అందచేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఆర్‌వీ.కృష్ణారెడ్డి, డైరెక్టర్ రాణా ప్రమోద్‌రెడ్డి, డీన్‌లు రామాంజనేయులరెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, పాయసం రమేష్, ఏవో హరి, చిరంజీవి, సుధారాణి, ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే లక్ష్యంగా విద్యార్థులు ఎదగాలి

● డాక్టర్ సాయి కుమార్

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్య పూర్తయ్యాక విద్యార్థులు ఉపాధి కల్పించేలా సంస్థలను ఏర్పాటు చేసే స్థాయికి ఎదగాలని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ఈడీ సెల్ కన్వీనర్ డాక్టర్ సాయికుమార్ అన్నారు. కళాశాలలో గురువారం ఎంటర్‌ప్రైనర్‌షిప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఓ సంస్థను స్థాపించాలంటే కలిగే వ్యయ ప్రయాసలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలు కూడా తెలుసుకోవాలన్నారు. అప్పుడే ప్రతి విద్యార్థి కూడా ఒక వ్యాపార సంస్థను ఏర్పాటు చేసి, పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగవచ్చన్నారు అనంతరం పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల యాజమాన్యం అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో డబ్ల్యూపీపీఐటీ ఇండియా కంపెనీ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మహాష్‌పవన్ సంతపల్లి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, వివిధ విభాగాధిపతులు డాక్టర్ మురళి, డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో రాత్రి విధులు నిర్వర్తించాలి

● బుచ్చి వైద్యాధికారికి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదేశం



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళలో ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలందించేందుకు రాత్రి విధులు ఖచ్చితంగా నిర్వర్తించాలని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి బుచ్చి వైద్యాధికారి పద్మజను ఆదేశించారు. గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు. ఎక్స్‌రే థియేటర్, ల్యాబ్‌తో పాటు పలు విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్యులు రాత్రుల్లో వుండడంలేదంటూ మండల సర్వసభ్యసమావేశంలో చర్చనీయాంశమైనా మీకు పట్టదా అంటూ వైద్యాధికారిపై మండిపడ్డారు. ప్రతినెలా కమిటీ సమావేశం ఏర్పాటుచేసి వైద్యసేవలు, వైద్యుల కొరత, ఆసుపత్రిలో లోటుపాట్లుపై చర్చించి ప్రతిపాదనలు పంపాలని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే ఆగిన ఓ బ్లాక్ పనుల నిర్మాణంకూడా పూర్తి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజమురళి, ఎంపీ శేషయ్య, వంశీధర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి ఉన్నారు.

దామరమడుగు హైస్కూల్ తనిఖీ

అనంతరం దామరమడుగు హైస్కూల్‌ను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం, కూరలు, చిక్కీలు నాణ్యతపై ఆరా తీశారు. 417మంది పిల్లలో 280మంది హాజరుకావడంపై హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, స్కూలు కమిటీతో సమావేశం అయ్యారు. తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలు వందశాతం స్కూలుకు వచ్చేలా చూడాలన్నారు. అన్నం ఉడికించడం లేదని గుడ్లు వాసనతో పాటు కూరలు రుచిగా వుండటం లేదని విద్యార్థులు ఎమ్మెల్యేకు తెలిపారు. మార్పు రాకపోతే చర్యలు తప్పవని వంట నిర్వాహకులు, హెచ్‌ఎంను హెచ్చరించారు. కాగా, హైస్కూల్‌లోని 6వ తరగతి విద్యార్థిని సయ్యద్ మాహియా షుగర్ వ్యాధితో బాధపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలుసుకుని నీకు ఏం కాదు.. నేనున్నా అంటూ భరోసా ఇచ్చారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజకవర్గంలో రైతుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గురువారం కలెక్టరేట్‌లో జేసీ కార్తీక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వరి రైతులకు ప్రకటించిన గిట్టుబాటు ధర కల్పించేలా చొరవ తీసుకోవాలని, సహకార సొసైటీ సిబ్బందికి చెల్లించాల్సిన కమీషన్ల తాలూకు బకాయిలు చెల్లించాలని కోరారు. కోవూరు ప్రాంతంలో రైతులకు ఖాళీ గోతాలు, హమాలీల కొరత రాకుండా చూడాలన్నారు. ధాన్యం రవాణాకు సంబంధించి ఎటువంటి అవాంతరాలు లేకుం డా, అన్నదాతలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

పాపాలు పండి..11 సీట్లకే పరిమితమైన వైసీపీ

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



సిమెంట్ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):మాజీ ముఖ్యమంత్రి జగన్ చేసిన పాపాలన్నీ పండినందునే మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో 11 సీట్లకు వైసీపీ పరిమితమైందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని ఎగువమిట్టలో గురువారం రూ.25 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లతో పాటు గోకులంను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చేసిన ప్రతి పాపానికి జగన్ శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో ప్రజాపాలన మళ్లీ మొదలైందన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు, వివిధ శాఖల అధికారులున్నారు.

ప్రజల కోసం పనిచేయండి

సచివాలయ ఉద్యోగులు ప్రజల కోసం పనిచేయాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఇడిమేపల్లి సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. పలువురు ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ సక్రమంగా విధులు నిర్వర్తించడంతోపాటు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించారు. ప్రధానంగా గిరిజనులతోపాటు ఇతర వర్గాల్లోని నిరుపేదలకు ఆధార్‌కార్డులు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కల్పన తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పునః ప్రతిష్ఠ పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో నాగరాజు, నాగలక్ష్మీ విగ్రహాల పునఃప్రతిష్ఠ పూజలు గురువారం ప్రారంభమయ్యాయి. పూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు గూడాల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, పీటీ జగన్నాథం, కేజీ శంకర్, పర్యవేక్షించారు.

ఇరుగాళమ్మకు వేలం ద్వారా రూ.6.51లక్షల ఆదాయం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో గురువారం బహిరంగ వేలం జరిగింది. ఈ వేలం ద్వారా గత ఏడాది కన్నా రూ.6.51లక్షలు ఆదాయం లభించిందని ఈవో వీ గిరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

మాగుంట ఆరోగ్యం కోసం పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కోలుకోవాలని ప్రార్థిస్తూ మాగుంట అభిమానులు ప్రత్యేక పూజలు చేశారు. మాగుంట లేఅవుట్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం మాగుంట శస్త్రచికిత్స విజయవంతం కావాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు, టీడీపీ సీనియర్ నాయకులు రఘురామ్ ముదిరాజు, టెలికాం మాజీ మెంబరు పీ సీనయ్య, పాములు రమణయ్య, పుష్పరాజ్, తదితరులు పాల్గొన్నారు.

తండ్రీకుమారుల అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తండ్రీకుమారులు అదృశ్యమైన ఘటనలో నగరంలోని చిన్నబజారు పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు, మాలాపేట రావిచెట్టు సెంటర్‌కి చెందిన సుప్రజకు, గాంధీనగర్‌కు చెందిన అశోక్‌రత్న వర్మ అలియాస్ అశోక్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. ఆయన వేదాయపాలెం సెంటర్‌లో మొబైల్‌షాపు నిర్వహిస్తున్నారు. వారికి బాబు(4), పాప(20) ఉన్నారు. పాపకు జన్మనిచ్చాక సుప్రజ పిల్లలతో తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఈ క్రమంలో అశోక్ భార్యవద్దకు వెళ్లి కుమారుడిని తీసుకొని వెళ్లాడు. అప్పటి నుంచి అతడి ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. భర్త, కుమారుడు ఆచూకీ కోసం ఆమె గాలించినా జాడ తెలియలేదు. దీంతో గురువారం చిన్నబజారు పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● **పిల్లలతో తల్లి అదృశ్యం**

తల్లి, ఇద్దరు పిల్లలతో అదృశ్యమైన ఘటనపై చిన్నబజారు పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు, ట్రంకురోడ్డు లస్సీ సెంటర్ సమీపంలో కృష్ణవేణి కుటుంబం నివాసం ఉంటోంది. ఆమెకు ముగ్గురు సంతానం. పెద్దకుమార్తె సంకీర్తనకు బాలాజీనగర్‌కు చెందిన నాగార్జునతో వివాహం చేసింది. వారికి ఇద్దరు పిల్లలు. ఐదు నెలలుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతుండటంతో మహిళాపోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నడుస్తోంది. ఈ క్రమంలో మూడు రోజుల కిందట సంకీర్తన తన పిల్లలతో కలిసి తల్లి వద్దకు వచ్చింది. బుధవారం పనినిమిత్తం కృష్ణవేణి బయటకు వెళ్లింది. సంకీర్తన అదే సమయంలో తన పిల్లలను తీసుకుని ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయింది. పని నుంచి ఇంటికి వచ్చిన కృష్ణవేణి కుమార్తెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోవడంతో గురువారం రాత్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులివ్వండి : కమిషనర్



ఖాళీ స్థలంలో మురుగును పరిశీలిస్తున్న కమిషనర్

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి6, (ఆంధ్రజ్యోతి): మురుగు, దోమల వ్యాప్తికి కేంద్రాలుగా మారిన ఖాళీ స్థలాలను శుభ్రం చేసుకోవాలని సూచిస్తూ, వాటి యజమానులకు నోటీసులివ్వాలని ఎన్‌ఎంసీ కమిషనర్ సూర్యతేజ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. గురువారం 33వ డివిజన్ నేతాజీ, వెంగళరావునగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ స్థలాలన్నింటినీ పిల్లలు ఆడుకునే కేంద్రాలుగా మార్చాలన్నారు. ఆదిశగా వాటి యజమానులకు సూచించాలని తెలిపారు. అనంతరం విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న శానిటేషన్ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం షోకాజు నోటీసు జారీ చేసి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలు సోలార్ ప్యానల్ ద్వారా విద్యుత్ సదుపాయం పొందేందుకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పారిశుధ్యం పనులను పరిశీలించారు.

మన్నవరప్పాడులో గడప గడపకు..



వృద్ధుడితో మాట్లాడుతున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 6, (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని మన్నవర ప్పాడులో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి గురువారం గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లిన ఆయన ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన ప్రభుత్వ పరంగా ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమస్య ఎలాంటిదైనా తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

చిన్నారులకు మెరుగైన చికిత్స అందించాలి

● జిల్లా న్యాయాధికారి వాణి



చిన్నారిని పరిశీలిస్తున్న న్యాయాధికారి వాణి, వైద్యులు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జీజీహెచ్ ప్రాంగణంలో ఉన్న జిల్లా బాల భవిత కేంద్రాన్ని గురువారం జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కే వాణి పరిశీలించారు. అక్కడ చిన్నారులకు అందుతున్న వైద్య చికిత్సలను అడిగి తెలుసుకున్నారు. అన్ని విభాగాలు పరిశీలించి చిన్నారులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని తెలిపారు. దివ్యాంగుల పిల్లలను గుర్తించి వారికి సరైన వైద్య చికిత్సలు అందించాలని కోరారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం జిల్లా బాలభవిత కేంద్రాలలో చిన్నారులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి నివేదిక అందించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, బాల భవిత కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సురేష్‌బాబు, యశ్వంత్, డాక్టర్ సుప్రియ, కో ఆర్డినేటర్ జమీర్, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, మోగరాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన



సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పిస్తున్న విద్యుత్ డీఈ కిరణ్, ఏఈ లక్ష్మీబాయ్

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సర స్వతీనగర్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం సూర్యఘర్ పథకంపై విని యోగదారులకు అవగాహన క ల్పించారు. డైకస్‌రోడ్డు విద్యుత్ ఏఈఎస్ లక్ష్మీబాయ్ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్ర నగర్ సబ్ డివిజన్ విద్యుత్ డీఈ కిరణ్ విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వినియోగం వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయని, ప్రతి ఒక్క వినియోగదారుడు సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించుకోవాలన్నారు. సోలార్ విద్యుత్ వినియోగం వల్ల నెలవారీ బిల్లు పూర్తిగా తగ్గించుకోవచ్చన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్తి బిజిలీ యోజన పథకం ద్వారా సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవడం చాలా సులభతరమన్నారు. కార్యక్రమంలో సౌత్ ఎర్న్ గ్లోబల్ ఎనర్జీ వెండర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : నవాబుపేట భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి జీనిగలవీధిలోని స్థలాన్ని కొంతమంది ఆక్రమించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు గురువారం ఆలయ ఈవో ఆ ఆక్రమణలను తొలగించారు. మరోసారి ఆలయ భూముల్లోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

పొదలకూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఏఎంవీఐ పూర్ణచంద్రరావు సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. కారు నడిపేటప్పుడు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్, నజ్మాసుల్తానా, తదితరులు పాల్గొన్నారు.

చింతోపు ఉపసర్పంచికి పంచాయతీ బాధ్యతలు

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతోపు గ్రామ ఉప సర్పంచి వినుకొండ సుధాకర్‌కు గ్రామ బాధ్యతలు అప్పగించినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి గురువారం తెలిపారు. గ్రామ సర్పంచ్ లేబూరు మల్లికార్జున్ గత రెండు నెలల నుంచి అందుబాటులో లేకపోవడంతో, గ్రామంలో పారిశుధ్యం, తాగునీటి పనులు కుంటుపడడంతో ఉపసర్పంచ్ వినుకొండ సుధాకర్‌కు గ్రామ బాధ్యతలు అప్పజెప్పారని మండలాభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

విలీనం చేయొద్దని విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



విరువూరు ప్రగతినగర్ పాఠశాల ముందు నిరసన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు, విద్యార్థులు

పొదలకూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలలోనే తమకు చదువుకునే అవకాశం కల్పించాలని కోరుతూ మండలంలోని విరువూరు ప్రగతినగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులు, తల్లిదండ్రులు గురువారం పాఠశాల ఎదుట ధర్నా చేశారు. ఈ పాఠశాలలో 2వ తరగతి పూర్తయిన వారిని గ్రామంలోని వేరే పాఠశాలలో కలపడం తగదని, దాని వల్ల తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని, మా పాఠశాల మాకే ఉంచాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థులను విరువూరులోని మెయిన్ స్కూల్‌లోకి విలీనం చేయవద్దన్నారు. అనంతరం ఎంఈవోకు వినతిపత్రం అందించారు.


జగన్ మాటలను ప్రజలు నమ్మరు..!

వెంకటాచలం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు అన్నారు. వెంకటాచలంలో ఆయన గురువారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వైసీపీలో ఉన్న నేతలు, కార్యకర్తలను కాపాడుకోవాలనే ఇప్పుడు 2.0 పేరుతో కొత్త నాటకానికి తెరలేపారని ఎద్దేవా చేశారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

13 మార్చి 2020 తిరుపతి మున్సిపల్ ఎన్నికల నామినేషన్‌కు ఆఖరి తేదీ..

నామినేషన్లు వేసేందుకు వచ్చిన టీడీపీ అభ్యర్థులను అడ్డుకోవడం, బెదిరించడం, నామినేషన్లను చించివేయడం, చొక్కాలు పట్టుకుని లాగి పడేయడం, బూతులు తిట్టడం.. వెనక్కి పంపడం... వంటివి పోలీసుల సాక్షిగానే అడ్డూ అదుపూ లేకుండా జరిగాయి. అంతకు ముందు ఇవే చర్యలతో తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లకు గాను 22 ఏకగ్రీవాలు చేసుకున్నారు. 27 డివిజన్లకు ఎన్నికలు జరిగాయి. ఫోర్జరీ సంతకం వివాదం కారణంగా ఎస్ఈసీ ఆదేశం మేరకు 7వ డివిజన్లో ఎన్నిక ఆగిపోయింది. అప్పుడు జరిగిన పరిణామాలు ఇవీ...



"తిరుపతిలో ఇంత అరాచకం ఎన్నడైనా చూశామా? రౌడీయిజంతో, దౌర్జన్యంతో.. ఇదీ ఒక గెలుపేనా? ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యింది" అంటూ గుండెలు బాదుకుంటున్నారు. ఆవేశంతో ఊగిపోతున్నారు. ఆగ్రహంతో రగిలిపోతున్నారు. శాపనార్థాలు పెడుతున్నారు. నాలుగున్నరేళ్ల తర్వాత బదులు తీర్చుకుంటామని బెదిరిస్తున్నారు. తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో తిరుపతిలోని వైసీపీ నాయకుల తీరు ఇప్పుడొక చర్చగా మారింది. అధికారంలో ఉన్న ఐదేళ్లూ.. వీరు చేసిందేమిటి.. అని ప్రజలు మాట్లాడుకుంటున్నారు. దొంగ ఓట్ల దండుతో, దౌర్జన్యాలతో, దాడులతో, బెదిరింపులతో గతంలో జరిగిన ఎన్నికలను ప్రస్తావిస్తున్నారు. ఏకంగా ఎన్నికల అధికారి కంప్యూటర్‌లోకే చొరబడి నకిలీ ఓటరు కార్డులు తయారు చేశారంటూ కేంద్ర ఎన్నికల సంఘమే తప్పు పట్టిన వైనాన్ని జనం మరచిపోలేదు. తిరుపతి ప్రశాంత చరిత్రకే మాయని మచ్చను మిగిల్చిన ఘనులు.. ఇప్పుడిలా నీతి వాక్యాలు వల్లిస్తున్నారేమిటా అని ఆశ్చర్యపోతున్నారు. రౌడీయిజమే రాజకీయమనేలా ప్రవర్తించిన వారే ఏడుపులు పెడబొబ్బలు పెట్టడం విచిత్రమని ప్రజలు వ్యాఖ్యానిస్తూ.. ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లి జగనన్న పాలనలో జరిగిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల తంతును ఇలా గుర్తు చేసుకుంటున్నారు...

– తిరుపతి, ఆంధ్రజ్యోతి



ఫ్లాష్‌బ్యాక్

..మరి ఇవేంటి బాసూ?

కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ రౌడీయిజాన్ని గుర్తు చేసుకుంటున్న జనం



టీ దుకాణాన్ని తొలగించారు

టీడీపీ నేత ఆర్సీ శ్రీనివాస్ భార్య ఆర్సీ లక్ష్మీదేవి 43వ డివిజన్ అభ్యర్థిగా రంగంలోకి దిగడంతో ఆమె టీ దుకాణాన్ని వైసీపీ నేతలు కార్పొరేషన్ అధికారులను అడ్డుపెట్టుకుని తొలగించారు. వారి జీవనాధా రాన్ని కోల్పోయేలా చేశారు.

ప్రపోజర్‌ను వదలని వైనం

45వ డివిజన్‌లో నామినేషన్ వేసేందుకు టీడీపీ అభ్యర్థి చంద్రమోహన్‌కు ప్రపోజర్‌గా ఉన్న గోళ్ల లోకేష్ నాయుడుపై వైసీపీ నేతలు దాడికి పాల్పడ్డారు. తిరుమల బైపాస్‌రోడ్డులోని అతని టీ స్టాల్‌ను ధ్వంసం చేశారు.



అభినయ్ ఏకగ్రీవం కోసం..

వైసీపీ ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి తనయుడు భూమన అభినయ్ 4వ డివిజన్ నుంచి నామినేషన్ వేశారు. టీడీపీ తరపున వేణు, అరుణలను పోటీలో నిలపాలని ఆ పార్టీ భావించింది. తమతో ఎవరినీ కలవనీయకుండా ఫోన్లు తీసిపెట్టుకుని పక్కాగా స్కెచ్ వేసుకున్నారని టీడీపీ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసింది.

సుగుణమ్మపై బూతుల దండకం

తిరుపతి మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ముగింపు రోజున మాజీ ఎమ్మెల్యే సుగుణ మ్మ కార్పొరేషన్ కార్యాలయం లోపలికి వస్తుండగా పూటుగా మద్యం సేవించిన ఓ వైసీపీ మద్దతుదారుడు అటకాయించాడు. దుర్భాషలాడారు. అభ్యర్థి మన్నెం శ్రీనివాసులను నోటికొచ్చినట్టు తిట్టి మెడపట్టి బయటకు తోసేశాడు. పాపం.. పోలీసులు మాత్రం సినిమా చూస్తున్నట్టు ఉండిపోయారు.

బయటకు తోసేశారు

16వ వార్డుకు నామినేషన్ వేసేందుకు వెళ్లిన టీడీపీ అభ్యర్థి ఆనంద్‌బాబు యాదవ్‌ను వైసీపీ అభ్యర్థి మోహన్ కృష్ణ యాదవ్, అతని సహచరుడు నవీన్ నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారు. షర్ట్ కాలర్ పట్టుకుని గేటు బయటకు నెట్టివేశారు. పోలీసులు చూస్తూ ఉండిపోయారు.

ఏకంగా ఫోర్జరీకే తెగించారు

టీడీపీకి చెందిన పెరుమాళ్ మధు భార్య విజయలక్ష్మి 7వ వార్డునుంచి నామినేషన్ దాఖలు చేశారు. ఎన్ని చేసినా ఆమె వెనక్కి తగ్గలేదు. దీంతో ఆమె ఉపసంహరించుకున్నారని అధికారి ప్రకటించారు. తన సంతకాన్ని మురళి అనే వ్యక్తి ఫోర్జరీ చేసి నామినేషన్‌ను విత్‌డ్రా చేశారంటూ అభ్యర్థి ఎన్నికల అధికారులను నిలదీశారు. తమకు న్యాయం జరగకపోతే కార్పొరేషన్ కార్యాలయం ముందే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు. దీంతో 7వ వార్డు ఎన్నిక ఆగిపోయింది. విచారణ అనంతరం అది ఫోర్జరీ సంతకమని కూడా ఫోరెన్సిక్ తేల్చింది.



తనకు జరిగిన అన్యాయానికి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన అభ్యర్థి విజయలక్ష్మి

స్వతంత్రులనూ వదల్లేదు

41వ డివిజన్‌కు ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు వచ్చిన టీటీడీ ఉద్యోగుల సంఘం నేత వెంకటేష్ భార్య చంద్రికను వైసీపీ నేతలు అడ్డుకున్నారు. నామినేషన్ పత్రాలను చింపి బయటకు పంపారు. దీంతో చంద్రికకు మద్దతుగా సీఐటీయూ నాయకుడు కందారపు మురళి సచివాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అదేవిధంగా 38వ డివిజన్‌కు ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు వచ్చిన దళిత అభ్యర్థి విల్సన్ నామినేషన్ పత్రాలను వైసీపీ నాయకులు చించి తరిమేశారు. దీంతో దిక్కుతోచని విల్సన్ అంబేడ్కర్ భవనం వద్దకు వెళ్లి మొరపెట్టుకున్నారు.

గడువు దాటేలా పన్నాగం

పోస్టల్ కాలనీలోని సచివాలయ కేంద్రంలో వైసీపీ నాయకులు ముందస్తుగా ఓ 50మంది డమ్మీ అభ్యర్థులను క్యూలో నిలబెట్టారు. నామినేషన్ వేసేందుకు వచ్చిన ఆర్కే విమలను సమయం అయ్యేవరకు నిలబెట్టారు. సమయం దాటిపోవడంతో బాధతో నామినేషన్ పత్రాలు చించేసి అభ్యర్థి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

20 నిమిషాలకు ముందే..

మరో 20 నిమిషాల్లో నామినేషన్ల ఘట్టం పూర్తవుతుండగా వైసీపీ మద్దతుదారు ఒకరు నగరపాలక కార్యాలయం గేటు మూసివేశాడు. నామినేషన్ వేసేందుకు వచ్చిన వారిని లోనికి అనుమతించలేదు. దీంతో నామినేషన్ వేసేందుకు వచ్చినవారు వెనుతిరగాల్సి వచ్చింది.

బీజేపీ అభ్యర్థిని కిందపడేసి కొట్టి..

బీజేపీ అభ్యర్థిగా సీఎస్ శరవణ 10వ డివిజన్‌కు నామినేషన్ వేసేందుకు వెళుతుండగా వైసీపీ కార్యకర్తలు అతడిని కిందపడదోసి నామినేషన్ పత్రాలతో పాటు మొబైల్ ఫోన్, ఏటీఎం లాక్కున్నారు. అప్పటికే అక్కడ ఉన్న ఎస్పీకి శరవణ మొరపెట్టుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోవడంతో ఆయన నిస్పృహతో వెనుతిరిగారు.

తిరుపతిని భ్రష్టుపట్టించింది మీరే

● తండ్రీ కొడుకులకు కార్పొరేటర్ దొడ్డారెడ్డి బహిరంగ లేఖ

తిరుపతి, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది. డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా జరిగిన నాటకీయ పరిణామాల నేపథ్యంలో నలుగురు కార్పొరేటర్లపై వైసీపీ బహిష్కరణ వేటువేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా దొడ్డారెడ్డి కుటుంబంపైనే భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన కుమారుడు ఫోకస్ చేయడం చర్చకు దారి తీసింది. దీనికి ప్రతిస్పందనగా వైసీపీ హయాంలో భూమనకు ఆత్మగా వ్యవహరించిన దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి తనయుడు 10వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రతాప్‌రెడ్డి గురువారం సోషల్ మీడియాలో విడుదల చేసిన ఓ లేఖ రాజకీయంగా చర్చగా మారింది. 'దివంగత వైఎస్ రాజారెడ్డితో మొదలైన మా రాజకీయ ప్రస్థానం వైఎస్ఆర్‌తో కలిసి నడిచేలా చేసింది. జగనన్న కష్టకాలంలోనూ పార్టీ వీడకుండా ఎన్ని అవమానాలు ఎదురైనా అంకితభావంతో పనిచేశాం. దానికి బహుమానంగా మాపై సస్పెన్షన్ వేస్తారా? మీ మొండి వైఖరితో పార్టీకోసం కష్టపడినవారిని విస్మరించినందుకే రాయలసీమలో ఏ అభ్యర్థి పొందని ఘోరమైన ఓటమిని తిరుపతిలో మూటకట్టుకున్నారు. వైసీపీ ఆవిర్భావం నుంచి కష్టపడ్డ ఒక్క కార్యకర్తకైనా అధికారంలోకి వచ్చాక లబ్ధి చేకూర్చారా? వైఎస్ కుటుంబ కోసం పనిచేశామే గానీ మీలాంటి చరిత్ర హీనులకోసం కాదు. తిరుపతిలో పార్టీలకతీతంగా సోదర భావంతో మెలిగే వాతావరణాన్ని మీరే తుడిచివేశారు. మీ నీచమైన రాజకీయాలకోసం, విద్వేష భేషజాలకు ఆజ్యంపోసి ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని భ్రష్టుపట్టించింది మీ తండ్రీ కొడుకులే కదా!' అంటూ పోస్ట్ చేసిన లేఖ వైరల్‌గా మారింది.

30 రోజుల్లో తెలుగు రీడింగ్ ఛాలెంజ్

● నేటినుంచి రెండు పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 30 రోజుల్లో తెలుగు రీడింగ్ ఛాలెంజ్.. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తెలుగు భాషను స్పష్టంగా చదివేలా నేర్పించేందుకు ఉద్దేశించిన కార్యక్రమమిది. తిరుపతికి చెందిన భాస్కర్‌రాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో తిరుపతి నగరం సంజయ్‌గాంధీ కాలనీలోని మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాల, చంద్రగిరిలోని జేఆర్‌కేఆర్ఎం పాఠశాలలో శుక్రవారం నుంచి 30 రోజులపాటు పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేయనున్నారు. ఈ మేరకు డీఈవో కేవీఎన్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పాఠశాలల్లోని 2, 3 తరగతుల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణనిచ్చి 30 రోజుల్లోనే 10వ తరగతి పాఠ్యపుస్తకాలను ధారాళంగా చదివేలా చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత అన్ని పాఠశాలల్లోనూ ప్రారంభించనున్నారు.



ఆయన (రజనీకాంత్) చిట్టి. ఈయనేమో (జగన్) చిట్టిరెడ్డి. ఇప్పుడు జగన్ 2.0గా వస్తారంట. కసిగా, స్పీడ్‌గా వస్తారంట. ఆయన 5.0గా వచ్చినా జనం ఓట్లు వేయరు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నంచేసి, 20 ఏళ్ల వెనక్కి నెట్టేశారు. ఇప్పుడు విదేశాలకు వెళ్లొచ్చి మరో 30 ఏళ్ల రాష్ట్రాన్ని ఏలతానంటూ మతిభ్రమించి మాట్లాడుతున్నారు.

– కిరణ్‌రాయల్, తిరుపతి జనసేన నేత

సీబీసీఐ కింద భూములు కోల్పోతున్న రైతులకు రూ. 78.84 కోట్ల పరిహారం

● రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

తిరుపతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం తమ్మినపట్నం, కోట మండలం కొత్తపట్నం గ్రామాల పరిధిలో చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (సీబీసీఐ)కు భూములు కోల్పోతున్న రైతులకు రూ.78,84,83,200 పరిహారం చెల్లించడానికి కలెక్టర్ పంపిన ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించింది. ఈ అంశాన్ని ప్రత్యేక కేసుగా పరిగణిస్తూ 2012 సెప్టెంబరు 14న జారీ చేసిన జీవో ఎంఎస్ నంబరు 571ను సడలించి మరీ ఈ ఒక్కసారికి ఈ మొత్తాన్ని పరిహారంగా చెల్లించేందుకు అంగీకరించింది. టీటీడీలో 15 సీనియర్ పోటు వర్కర్ పోస్టులను సూపర్‌వైజర్ పోస్టులుగా స్థాయి పెంచాలని టీటీడీ చేసిన అభ్యర్థనపై మంత్రివర్గం సానుకూలంగా స్పందించింది. ఆ మేరకు 15 సీనియర్ పోటు వర్కర్ పోస్టులను రూ. 40,970 - రూ.1,24,380 జీత శ్రేణితో సీనియర్ అసిస్టెంట్ హోదాతో సమాన హోదా కల్పిస్తూ సూపర్‌వైజర్ పోస్టులుగా స్థాయి పెంచేందుకు అంగీకరించింది. అమరావతిలో గురువారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో జిల్లాకు సంబంధించి ఈ రెండు సానుకూల నిర్ణయాలు తీసుకున్నారు.

ఏమార్చి.. ఇంట్లో నగలు కొట్టేసి..!

● ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు
● రూ.30 లక్షల బంగారు ఆభరణాలు, కారు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఇంటి డ్రైనేజీ పైపులు కొలతలు తీయాలంటూ యజమానిని పక్కకు తీసుకెళతారు. మరొకరు ఇంట్లోకి దూరి నగలు.. విలువైన ఆస్తులు మూటకట్టేస్తారు. ఇలా తిరుపతిలో దొంగతనానికి పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాల్లో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.30 లక్షల విలువైన నగలు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను గురువారం తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధనరాజు మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ కేశవాయనగుంటకు చెందిన పోలిన ధనమ్మ ఇంటి వద్దకు గతేడాది డిసెంబరు 20వ తేదీన కృష్ణ, అతడి తమ్ముడు శరత్, వేణుగోపాల్ వచ్చారు. మున్సిపల్ సిబ్బంది అని చెప్పారు. ఆ ఇంట్లో వాటర్ కనెక్షన్లు, డ్రైనేజీ పైపుల కొలతలు తీయాలని ఆమెను నమ్మించారు. ఇంటి పక్కన, వెనుక వున్న డ్రైనేజీ పైపులను చూపిస్తున్న ఆమె వెంట ఇద్దరు వెళ్లారు. మరొకడు ఇంట్లోకి వెళ్లి బీరువా, అల్మరాలో ఉన్న బంగారు నగలు, డబ్బు అపహరించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు.. అదనపు ఎస్పీ (క్రైం) నాగభూషణరావు ఆధ్వర్యంలో డీఎస్పీ శ్యాంసుందర్ పర్యవేక్షణలో అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి.. పాత వేలిముద్రలు, వారి కళ్ల ఫొటోల ఆధారంగా నిందితుల కోసం అనుమానిత ప్రాంతాల్లో గాలించారు. ఈ క్రమంలో తమకు అందిన సమాచారం మేరకు తిరుపతిలోని చెర్లోపల్లె రోడ్డులో తనిఖీలు చేస్తుండగా నిందితులు తారస పడ్డారు. క్రైం పోలీసుల వద్దనున్న సమాచారం ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. వారి నుంచి రూ 30 లక్షల విలువైన 280 గ్రాముల బంగారు నగలు, ఒక కారు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు. ఈ కేసులో విశేష ప్రతిభ కనపరచిన క్రైం సీఐలు చిన్న పెద్దయ్య, శివకుమార్ రెడ్డి, ప్రకాష్ కుమార్, ఎస్ఐ ప్రదీప్ కుమార్ రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు రవిప్రకాష్, మురళి, మునిరాజులు, బసవరాజు రమేష్, గోపీకృష్ణ, వినాయక, కానిస్టేబుళ్ళు నాగరాజు శెట్టి, మోహన్, హరిప్రసాద్, సైబర్ క్రైం సిబ్బంది రాజశేఖర్‌ను ఎస్పీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న నగలను చూపుతున్న ఎస్పీ

నిందితులది కర్ణాటక : నిందితులైన ఎ.కృష్ణ, అతడి తమ్ముడు శరత్, వేణుగోపాల్‌ది కర్నాటక రాష్ట్రం షిమోగా. ఈ ముగ్గురు స్నేహంగా ఉండేవారు. రవి, గణేష్, ప్రశాంత్‌తో కలిసి చెడు అలవాట్లకు లోనయ్యారు. చిన్న చిన్న దొంగతనాలకు అలవాటు పడ్డారు. ఆ తర్వాత బస్సుల్లో ప్రయాణికుల బ్యాగులు కొట్టేసేవారు. ఆ తర్వాత ఇళ్లలో దొంగతనాలు, మోటారు సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్నారు. వీరిపై పలు చోట్ల కేసులు నమోదయ్యాయి. పలుసార్లు జైలుకు వెళ్లొచ్చారు.




స్మగ్లర్లను అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

రూ.4.20 కోట్ల ఎర్రచందనం పట్టివేత

● ఎనిమిది మంది అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్ట్

మంగళం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రెండు ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో రూ.4.20 కోట్ల విలువైన ఆరు టన్నుల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ఎనిమిది మంది అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్ట్ చేశామన్నారు. ఆయన చెప్పిన ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం సానిపాయలోని కోమిటోనిచెరువు సమీపంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కూంబింగ్ చేపట్టారు. ఒక కారు, మోటార్ సైకిల్ ఆగి ఉండటం.. కొందరు ఎర్రచందనం దుంగలను కారులో లోడ్ చేసేందుకు వెళ్తుండటాన్ని గమనించారు. టాస్క్‌ఫోర్సు సిబ్బంది వారిని చుట్టుముట్టగా ఎనిమిది మంది పట్టుబడ్డారు. మిగిలిన వారు పారిపోయారు. వారి నుంచి రెండు వాహనాలు, 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారు తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు. విచారణలో వారు చెప్పిన సమాచారం మేరకు కర్ణాటక రాష్ట్రం హొస్కోట తాలూకా కటికనల్లి సమీపంలో దాచి ఉంచిన 185 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం, స్మగ్లర్లను, వాహనాలను తిరుపతి కపిలతీర్థం వద్ద గల టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీటి మొత్తం విలువ రూ.4.2 కోట్లుగా అంచనా వేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. సిబ్బందికి రివార్డు ప్రకటించారు.



తనిఖీ చేస్తున్న బాంబు స్క్వాడ్ సిబ్బంది

వ్యవసాయ కళాశాలకు మళ్లీ బాంబు బెదిరింపు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి వ్యవసాయ కళాశాలకు మళ్లీ బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. స్వాతి బిలాల్ మాలిక్ పేరిట గురువారం వచ్చిన ఈ మెయిల్‌లో చిత్రకళ గోపాల్ ఘటన, సికిందర్ దర్గా ఘటన, సూసైడ్ హ్యూమన్ ఐఈడీల తయారీ తదితర అంశాలను ప్రస్తావించారు. ప్రిన్సిపాల్ రమణ డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో తిరుపతి రూరల్ పోలీసులు, డాగ్.. బాంబు డిస్పోజ్ స్క్వాడ్లు కళాశాలకు చేరుకున్నాయి. ప్రిన్సిపల్ ఛాంబర్, తరగతి గదులు, హాస్టళ్లు, పరిసరాల్లోనూ రెండు గంటలకుపైగా తనిఖీ చేశారు. ఏవీ కనిపించకపోవడంతో మెయిల్ ఉత్తుత్తిదేనని తేల్చారు. గతంలోనూ ఇదే తరహాలో బెదిరింపు మెయిల్ వచ్చింది. కాగా, ఇప్పుడు వచ్చిన మెయిల్ ఆధారంగా దర్యాప్తు చేపట్టి.. సంబంధిత వ్యక్తులను గుర్తించే ప్రక్రియ వేగవంతం చేశామని తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రికి 21వ ర్యాంకు

తిరుపతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు పనితీరుపరంగా 21వ ర్యాంకు వచ్చింది. గురువారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు ఈ ర్యాంకులను ప్రకటించారు. గతేడాది జూలై నుంచి డిసెంబరు దాకా ఆరు నెలల పాటు ఫైళ్ల పరిష్కారంలో మంత్రుల పనితీరు ఆధారంగా ర్యాంకులు నిర్ణయించినట్టు ఆయన వెల్లడించారు. మొత్తం 24 మంది మంత్రులు ఉండగా.. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి సత్యప్రసాద్‌కు 21వ ర్యాంకు వచ్చింది.







తిరుమలలో దర్శకేంద్రుడు

తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ప్రముఖ సినీ దర్శకుడు రాఘవేంద్రరావు, నటుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, జగన్మోన్, పులివర్తి నాని, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

రాఘవేంద్రరావు - శ్రీనివాస్‌రెడ్డి - పులివర్తి నాని, జగన్మోహన్ - వసంత కృష్ణప్రసాద్

12న రామకృష్ణతీర్థ ముక్కోటి

తిరుమల, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 12న రామకృష్ణతీర్థ ముక్కోటి జరుగనుంది. తిరుమల కొండల్లో పవిత్రమైన సప్తతీర్థాలుగా స్వామి పుష్కరిణి, కుమారధార, తుంబురు కోన, శ్రీరామకృష్ణ తీర్థం, ఆకాశగంగ, పాపవినాశనం, పాండవతీర్థంలను భావిస్తారు. ఇందులో ఒకటైన రామకృష్ణ తీర్థం తిరుమలకు ఆరు మైళ్ల దూరంలో ఉంది. పుష్యమి నక్షత్రంతో కూడిన పౌర్ణమిరోజున ఈ తీర్థముక్కోటిని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఉదయం 7.30 గంటలకు శ్రీవారి ఆలయ అర్చకులు మంగళవాయిద్యాలతో ఆలయ మాడవీధుల గుండా పూలు, పండ్లు, స్వామి ప్రసాదాలతో శ్రీరామకృష్ణ తీర్థానికి వెళతారు. అక్కడున్న శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణుడి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పిస్తారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు గనుక ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలని ఉన్నతాధికారులు సంబంధిత అధికారులను ఆదేశించారు.

శ్రీహరి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లోని 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.2.97 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,600

తలనీలాలు సమర్పించినవారు: 19,083



అలుపన్నది ఉందా ఎగిరే అలకు..ఎదలోని లయకు అంటారు సిరివెన్నెల సీతారామశాస్త్రి ఓ సినీగీతంలో..రిటైరైనా... ఏడు పదులు దాటినా టెన్నిస్ రాకెట్ వదలని వీరిని చూస్తే ఆ పాటలోని మాటలు వీరికీ వర్తిస్తాయి. వీరి ఉత్సాహం చూసి వయసే వెనుకడుగేస్తుందేమో అనిపిస్తుంది. వృద్ధాప్యం దూరంగా జరిగిపోతోంది. నిరాశ పటాపంచలవుతోంది. జీవిత చరమాంకంలోనూ తరగని క్రీడోత్సాహం ప్రదర్శిస్తున్న ఈ విశ్రాంత ఉద్యోగుల తీరు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమవుతుంది. విశ్రాంత జీవితమంటే కుర్చీలకు, మంచాలకు అంటిపెట్టుకుపోవడమని భావించేవారిని ఉత్సాహపరిస్తుంది. వయసుతో పనిలేకుండా ఆరోగ్యం కోసం ఇప్పటికీ ఆటలాడుతున్న వారిని చూస్తే ఔరా అనిపిస్తుంది. తిరుపతిలోని ఆఫీసర్స్ క్లబ్,టౌన్‌క్లబ్‌ల్లో ఇలా టెన్నిస్ ఆడుతున్న కొందరు రిటైర్డ్ ఉద్యోగులను ఒకసారి పలుకరిద్దాం..

- తిరుపతి,క్రీడలు (ఆంధ్రజ్యోతి)



మలిసంధ్యలో మళ్లీ ఆడేద్దాం

● విశ్రాంత జీవితంలో ఉల్లాసంగా..

● ఏడు పదులు పైబడినా తరగని క్రీడోత్సాహం



లాన్‌టెన్నిస్ టోర్నీలో పాల్గొన్న వృద్ధ క్రీడాకారులు

రోగాలు దరిచేరవు....

నేను ఆంధ్రాబ్యాంకులో పనిచేసేవాడిని. మేనేజరు హోదాలో రిటైరయ్యాను. నాకు 76సంవత్సరాలు. చదువుకునే రోజుల నుంచి ఆటల్లో పాల్గొనేవాడిని. రిటైరయ్యాక పడక కుర్చీకి పరిమితం కావడం ఇష్టం లేదు. అందుకు ఆటను వదలలేదు. 60ఏళ్ల టెన్నిస్ ఆడుతున్నా, 40టోర్నమెంట్స్‌లో పాల్గొన్నాను. 18నేషనల్స్ టోర్నీలకు ప్రాతినిధ్యం వహించాను. బహుమతులు సొంతం చేసుకున్నా. రోజు ఏదో ఆటలాడితే అనారోగ్యం దరిచేరదు. మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. అందరూ తీరిక సమయంలో క్రీడల్లో పాల్గొంటే చాలా మంచిది.

- ఎన్.సి.అశోక్‌రెడ్డి
తిరుపతి

ఒక్క రోజు మిస్సైతే ఏదో కోల్పోయినట్టుంది...

ఎస్వీ యూనివర్సిటీలో ప్రొఫెసరుగా పనిచేసి రిటైరయ్యాను. నా వయసు 73ఏళ్లు. గడచిన 45 సంవత్సరాలుగా ఉదయం, సాయంత్రం స్నేహితులతో కలసి కనీసం రెండు గంటలపాటు టెన్నిస్ ఆడుతాను. రోజూ ఆడటం వల్లే యాక్టీవ్‌గా, ఫిట్‌గా ఉన్నానని నమ్ముతున్నా. షుగర్, బీపీలాంటివేవీ లేదు. ఎప్పుడైనా చిన్నపాటి దెబ్బలు తగలినా టెన్నిస్ వదల్లేదు. ఈ తరం పిల్లల్లో క్రీడలపై ఆసక్తి పెరగాలి. తల్లిదండ్రులు,స్కూలులో ఇందుకు ప్రోత్సహించాలి.

- హనుమంతరావు,
తిరుపతి

రిటైర్మెంటు వయసుకు మాత్రమే..

ప్రొఫెసరుగా రిటైరయ్యాను. ఇప్పుడు 78ఏళ్లు. ఎప్పుడూ ఆధారపడే మనస్తత్వం ఉండకూడదనుకుంటాను. మనసులో ఉత్సాహం ఉంటే లైఫ్ బాగుంటుంది. ఇందుకు క్రీడలు బాగా సహకరిస్తాయి. నా విషయంలోనే ఇదే కరెక్టయింది. రోజూ గంటపాటు టెన్నిస్ ఆడుతా. వాస్తవానికి నేను ఆహారం విషయంలో పెద్దగా నియమాలను పాటించను. చలాకీగా ఉంటాను. రిటైర్మెంటు వయసుకే గాని మనసుకు కాదని నమ్ముతాను. ఇప్పటివరకూ ఎలాంటి అనారోగ్య సమస్య ఎదురుకాలేదు. నేటి యువత కూడా క్రీడలపట్ల శ్రద్ధ చూపాలి. చదువు, ఆటల వల్ల క్రమశిక్షణ అలవాటవుతుంది.

- సి.రఘునాథరెడ్డి, నర్సింగాపురం

ఆటలతో ఆయుష్షు పెరుగుతుంది.

బీఎస్ఎన్ఎల్‌లో పనిచేసి రిటైరయ్యాను. గత 30ఏళ్లుగా టెన్నిస్ ఆడుతున్నా. ఎన్నో టోర్నీలో పాల్గొని రాణించాపే. ఆటల వల్ల ఆయుష్షు పెరుగుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆటలవైపు ప్రోత్సాహించాలి. మానసిక వికాసం, దేహదారుఢ్యం లభిస్తుంది. ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనే ధైర్యం అలవడువుతుంది. మనసు ధృడంగా ఉంటుంది. పోటీతత్వం పెరిగితే అన్ని రంగాల్లోనూ ముందంజ వేయవచ్చు.

- యు.ఆనందకేశవులు, తిరుపతి



గోదాములో రేషన్‌బియ్యం



ఏడు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి శివారులోని ఈదులగుంటలో అక్రమంగా ఉంచిన ఏడు టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల ఫిర్యాదుతో స్పెషల్‌బ్రాంచ్ పోలీసులు గురువారం రెక్కీ నిర్వహించారు. వీరి సమాచారంతో శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, టూటౌన్ పోలీసులను అప్రమత్తం చేశారు. వాళ్లు అక్కడికి చేరుకుని ఆటో సహా గోదాములోని రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు పంచనామా నిర్వహించి ఏడు టన్నుల బియ్యం ఉన్నట్లు తెలిపారు. సివిల్‌సప్లయిస్ గోదాముకు తరలించారు. రేషన్‌బియ్యం అక్రమార్కుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన పోకూరు గంగాధరం అనే యువకుడు రేషన్‌బియ్యం స్మగ్లింగ్ చేస్తూ పలుమార్లు పట్టుబడ్డాడు. కేసులూ ఉన్నాయి. ఈ రేషన్ బియ్యం కూడా అతడిగా అధికారులు నిర్ధారించినట్లు సమాచారం. ఇతడితో పాటు శ్రీకాళహస్తి మండలం తొండమనాడుకు చెందిన ఓ యువకుడు, వీరికి ముఠా నాయకుడిగా తిరుపతికి చెందిన ఓ మద్యం వ్యాపారి ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. పూర్తిగా విచారించి రేషన్‌బియ్యం స్మగ్లింగ్ వెనుక ఉన్న వారి వివరాలను వెల్లడిస్తామని టూటౌన్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



గోదాము వద్ద రేషన్‌బియ్యం తరలిస్తున్న ఆటో



రాత్రి గస్తీ పటిష్ఠ పరుస్తాం

పాత నేరస్తుల కదలికలపై నిఘా

ఎస్పీ హర్షవర్ధనరాజు వెల్లడి

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరుస దొంగతనాలు అరికట్టడానికి రాత్రి గస్తీలు, క్రైమ్ బీట్లపై పునఃసమీక్షించి పటిష్ఠపరుస్తామని ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. 'యూపీ ముఠా పనేనా?' అంటూ వరుస దొంగతనాలకు సంబంధించి ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఐదేళ్లలో జరిగిన దొంగతనాలు, దోపిడీలు, ఇతర ఘటనలను సమీక్షించి, ఎక్కడెక్కడ ఎక్కువగా.. ఏ సమయాల్లో.. ఎలాంటి దొంగతనాలు జరిగాయి? ఎవరి పాత్ర ఉందేది అధికారులతో సమీక్షిస్తామన్నారు. అక్కడ గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సిబ్బంది కొరత, వారం రోజులుగా వివిధ బందోబస్తు విధుల్లో ఉన్నందున బీట్లపై కొంత నిఘా తగ్గిందని అన్నారు. జిల్లాలోని పాత నేరస్థులు, అనుమానితుల వేలి ముద్రలు, ఫొటోలు సేకరించే పని వేగవంతం చేశామన్నారు. రెండు రోజుల వ్యవధిలో దాదాపు 80 మంది నేరస్థుల వేలి ముద్రలు సేకరించినట్లు ఆయన చెప్పారు. శివారు ప్రాంతాలు, ఏకాంత కాలనీలు, అక్కడక్కడ రోడ్ల పక్కన గుడిసెలు వేసుకుని ఉంటున్న వారిపైనా నిఘా పెంచుతామన్నారు. తిరుపతిలో సీసీ కెమెరాల వ్యవస్థను పరిశీలించి అవసరమైన చోట్ల కొత్తవి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎక్కడైనా పాత నేరస్తులు, అనుమానితులు తిరుగుతుంటే సమీప స్టేషన్లకు, లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

10న ముగియనున్న కుంభమేళా బుకింగ్

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళా ప్రత్యేక టూర్ ప్యాకేజీ టికెట్ బుకింగ్‌కు ఈ నెల 10వ తేదీతో గడువు ముగియనుందని డివిజనల్ మేనేజర్ సీహెచ్.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 11న ఉదయం 5 గంటలకు శ్రీనివాసం నుంచి బయల్దేరనున్న ఏసీ బస్సులో 45సీట్లకుగాను 24 రిజర్వేషన్ అయ్యాయని, 21మిగిలి ఉన్నాయని తెలిపారు. పోను, రాను ఛార్జీలు పెద్దలకు రూ. 22వేలు, పిల్లలకు(3నుంచి 10సంవత్సరాల లోపు వయస్సు) రూ.19వేలుగా నిర్ణయించినట్లు వెల్లడించారు. మార్గంమధ్యలో ఒంటిమిట్ట, బాసర, జబల్పూర్, చిత్రకూట్, ప్రయాగరాజ్, వారణాసి, నాగపూర్, ధర్మపురి, మహానంది తదితర ప్రాంతాలను చూపుతారని తెలిపారు. ఆసక్తిగలవారు మరిన్ని వివరాలకు 9848850099, 9848973985, 9848802099, 08772289123, 9848007033లను సంప్రదించాలని కోరారు.

పేదరిక నిర్మూలనకు పీ4 పాలసీని అమలు చేయండి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల్లో పేదరిక నిర్మూలనకు పీ4(పబ్లిక్, పీపుల్, ప్రైవేట్, పార్టనర్‌షిప్) అమలుకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి సీఎస్ పీ4పాలసీతో పాటు పలు అంశాలపై సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరయ్యారు. సీఎస్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్-2047లో పది సూత్రాల అమలుకు, రాష్ట్రంలో వృద్ధిరేటు సాధనకు, పేదరిక నిర్మూలనకు ప్రణాళికల తయారు చేసి, అమలు చేయాలన్నారు. అందుకోసం శుక్రవారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించాలని ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, డీపీవో సుశీలాదేవి పాల్గొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఇద్దరు ఉపాధ్యాయులను విధుల నుంచి తొలగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ గురువారం వెల్లడించారు. ఎరికంబట్టు హరిజనవాడలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ టి.వెంకటరమణ, తొట్టంబేడు మండలం ఎగువ సాంబయ్యపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు స్కూల్ అసిస్టెంట్ టి.కృష్ణయ్య పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్టు ఇటీవల ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. విచారణ జరిపించామని, నివేదికల ఆధారంగా క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు డీఈవో వెల్లడించారు.

బీసీ రుణాల దరఖాస్తుకు గడువు పెంపు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుకు ఈనెల 12వ తేదీ వరకు గడువు పెంచినట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారుల నుంచి వస్తున్న వినతులను దృష్టిలో పెట్టుకుని బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సహా వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో మంజూరు చేస్తున్న యూనిట్లకు దరఖాస్తుల గడవును పెంచడం జరిగిందని, అర్హులైన నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వైద్యశాఖలో ఉద్యోగాలకు నోటిఫికేషన్

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాల, రుయాస్పత్రి, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, శ్రీపద్మావతీ నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌కు సంబంధించి పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 22 తేదీ సాయంత్రం 5 గంటల్లోపు పూర్తి చేసిన దరఖాస్తులను ఎస్వీ వైద్య కళాశాలలో అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తులు, పూర్తి వివరాల కోసం కళాశాల వెబ్‌సైట్‌ను, ఉమ్మడి జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.



ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయురాలు

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● ఉపాధ్యాయురాలి మృతి

రేణిగుంట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ఉపాధ్యాయురాలు మృతి చెందిన సంఘటన గురువారం మర్రిగుంట వద్ద చోటుచేసుకుంది. గాజులమండ్యం పోలీసుల కథనం మేరకు గౌరీనగర్‌కు చెందిన కరీమునిసా బేగం పాపానాయుడుపేట జడ్పీ హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం తన ద్విచక్ర వాహనంపై పాపానాయుడుపేటకు వెళుతుండగా మర్రిగుంట మలుపు వద్ద రోడ్డు దాటే క్రమంలో తిరుపతి నుంచి మునిలిపేడుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉపాధ్యాయురాలి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుధాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గురుదక్షిణామూర్తికి బంగారు రుద్రాక్షహారం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ డాక్టర్ బొప్పల ఝాన్సీ లక్ష్మీబాయి రూ.8లక్షల విలువైన 32 పంచముఖ రుద్రాక్షల బంగారు హారాన్ని వితరణ చేశారు. దీనిని ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాయుడుపేటలో రామాంతపూర్ ఎక్స్‌ప్రెస్ నిలుపుదల

నాయుడుపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ నుంచి రామాంతపూర్‌కు వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్ తొలిసారిగా నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్‌కు గురువారం ఆమోదం పొందింది. తొలిసారిగా నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో ఉదయం 8.18 నిమిషాలకు స్టాపింగ్ కావడంతో డీఆర్‌యుసీసీ సభ్యుడు పేర్నాటి జోసెఫ్, రైల్వే బోర్డు మెంబరు చిగురాకుల సురేంద్ర, నాయుడుపేట సదరన్ రైల్వే వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.మస్తాన్, ఉపాధ్యక్షుడు రాఘవన్, కె. కిరణ్, స్టేషన్ మాస్టర్ చిరంజీవి తదితరులు రైల్వే డ్రైవర్లను సత్కరించారు. రామాంతపూర్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తూ నాయుడుపేటలో ప్రతి శనివారం రాత్రి 12.13 నిమిషాలకు నిలుపుదల ఉంటుందని వారు తెలియజేశారు.



అభినందనలు తెలియజేస్తున్న డీఆర్‌యుసీసీ సభ్యులు జోసెఫ్, మస్తానయ్య, రవి, తదితరులు

రైతులకు 9 గంటల విద్యుత్ సరఫరా

● ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలో వ్యవసాయ రంగానికి 9 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని సంస్థ సీఎండీ కె.సంతోష్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీమలో సాగుకు ఏడు గంటలే కరెంట్ అనే శీర్షికపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. సంస్థ పరిధిలో ఉన్న తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో రైతుల అవసరాల మేరకు 9 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని వివరించారు. చీఫ్ జనరల్ మేనేజరు(ఆపరేషన్) జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చే క్రమంలో సమయ గణాంకాల్లో పొరపాటు దొర్లిందని పేర్కొన్నారు.

జగనన్న కాలనీల్లో నకిలీ పట్టాల బాగోతం

● పూర్వ డీటీతోపాటు మరో ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు

రేణిగుంట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో నకిలీ పట్టాల బాగోతం వెలుగు చూస్తోంది. బాధితుల ఫిర్యాదు మేరకు పూర్వ డిప్యూటీ తహసీల్దారుతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. 2022లో తిరుపతి జీవకోనకు చెందిన బుజ్జమ్మ, చెంచయ్య, అహ్మద్, మల్లిషావలి అనే వారికి రేణిగుంట మండలం కుర్రకాల్వ, అడుసుపాళెం, తారకరామనగర్‌లో జగనన్న ఇంటి పట్టాలు ఇప్పిస్తానని రేణిగుంటలోని కొంతమంది దళారులను కలిసి అప్పటి ఓ అధికారి ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆరోపణలున్నాయి. వారి నుంచి ఒక్కో ఇంటి పట్టాకు రూ.1.8 లక్షల చొప్పున రూ.7.20 లక్షలను రెండు విడతలుగా తీసుకున్నట్లు విమర్శలున్నాయి. ఈ రేణిగుంట తహసీల్దారు కార్యాలయంలోని రికార్డు రూములో భద్రపరచిన ఖాళీ జగనన్న పట్టాలకు రెవెన్యూ సిబ్బంది చేత కొనుగోలుదారుల పేరు రాయించి ఇచ్చినట్లు తెలిసింది. ఇలా పట్టాలు ఇచ్చేసినట్లు వారికి చెప్పారు. ఆ సమయంలో వారికి స్థలాలు చూపలేదు. ఆ తర్వాత కొనుగోలుదారులు కంప్యూటర్ ఆపరేటర్ శశికళ, నకిలీ వీఆర్వో తనిష్కా, సుబ్రమణ్యం అనే దళారిని పలుమార్లు కలిసి నిలదీసినా ఫలితం లేకుండా పోయింది. చివరకు వారు తహసీల్దారు కార్యాలయంలో విచారించగా ఆ పట్టాలు బోగస్‌గా తేలడంతో మోసపోయామని గుర్తించారు. దీనిపై రేణిగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి డిప్యూటీ తహసీల్దారు ప్రేమ్‌కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ శశికళ, నకిలీ వీఆర్వో తనిష్కా, దళారి సుబ్రమణ్యంపై ఐపీసీ 468, 471, 420 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీనిపై తహసీల్దారు విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక అందజేయాల్సి ఉంది.

గ్రావెల్ టిప్పర్ సీజ్ : యజమానిపై కేసు నమోదు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్‌ను తొట్టంబేడు పోలీసులు సీజ్ చేశారు. తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపిన ప్రకారం.. శివనాథపాళెం పరిసరాల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఈశ్వరయ్య సిబ్బందితో శివనాథపాళెంలో గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం రాత్రి స్టేషన్‌కు తరలించారు. టిప్పర్ యజమాని రమేష్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం తహసీల్దారు మధుసూదన్‌రావుకు వాహనాన్ని అప్పగించినట్లు తెలిపారు. తాము వెళ్లేలోగా ఘటనా స్థలంనుంచి ఎక్స్‌కవేటర్ వెళ్లిపోయినట్లు ఎస్ఐ చెప్పారు. అక్రమంగా గ్రావెల్, ఇసుక తరలించే వాహనాలను గతంలో న్యాయస్థానానికి అప్పగించేవారు. ఇటీవల కొంతకాలంగా రెవెన్యూ అధికారులకు అప్పగిస్తుంటంతో అక్రమార్కులు మళ్లీ మళ్లీ తవ్వకాలకు తెగబడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తిరుపతికి చెందిన సత్యం ఐబీటీ అకాడమీ ఛైర్మన్ సత్య నారాయణ అన్నారు. గురువారం స్థానిక గాయత్రి పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించుకునేందుకు కష్టపడి చదవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి, రాధయ్య, కేఆర్‌రెడ్డి, చంద్రమోహన్, రాఘవరెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తడ కండ్రిగ సచివాలయం తనిఖీ


హాజరుపట్టికను తనిఖీ చేస్తున్న డిప్యూటీ సీఈవో రామమోహన్‌రావు

తడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : తడ కండ్రిగ సచివాలయాన్ని నెల్లూరు జెడ్పీ డిప్యూటీ సీఈవో రామమోహన్‌రావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 'సచివాలయాలలో సిబ్బంది ఏరి' అనే కథనం బుధవారం ప్రచురితమైన విషయం విదితమే. స్పందించిన ఆయన సచివాలయాన్ని తనిఖీ చేశారు. హాజరుపట్టికను తనిఖీ చేశారు. వివిధ రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేల వివరాలను అడిగి తెలుసుకొని వీలైనంత త్వరగా ఆ సర్వే పనులను పూర్తిచేయాలంటూ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సాధారణ నిధులు, 15వ ఫైనాన్స్ నిధుల వినియోగంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ మేరకు ఆయా రిజిస్టర్లను తనిఖీలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో విజయకుమార్, తడకండ్రిగ పంచాయతీ కార్యదర్శి గాబ్రియేల్, ఇతర సిబ్బంది ఉన్నారు.

తక్కువ ధరకే నాణ్యమైన ఉత్పత్తులు


మెప్మా మహిళల ఉత్పాదనలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ

నాయుడుపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మెప్మా మహిళలు తయారు చేసే వివిధ రకాల నాణ్యమైన ఉత్పత్తులు తక్కువ ధరకే లభిస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట గాంధీ మందిరం పార్కు వద్ద మెప్మా అర్బన్ మార్కెట్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. పొదుపు సంఘాలను బలోపేతం చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అనంతరం గెరిడీవీధిలోని ఆల్కలిన్ వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, టీడీపీ నాయకులు పసల గంగాప్రసాద్, గూడూరు సుధీర్‌రెడ్డి, ముత్యాలయ్య, హైమావతి, సునీత, గంగరాజు తదితరులు ఉన్నారు.

విన్నమాలలో తాగునీటి పథకం ఏర్పాటు


తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి నెలవల తదితరులు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని విన్న మాలలోని ఎస్టీ కాలనీలో తాగునీటి పథకాన్ని మాజీ ఎంపీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెల వల సుబ్రహ్మణ్యం గురువారం ప్రారంభించారు. గతంలో విన్నమాలలో జరిగిన రెవెన్యూ సదస్సులో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. స్పందించిన ఆయన ఆ ప్రాంతంలో సీసీ రోడ్లు, తాగునీటి బోరు పథకానికి నిధులు మంజూరు చేశారు. ఈ క్రమంలో బోరు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ కార్యదర్శి దార్ల రాజేంద్ర, నాయకులు మధురెడ్డి, రవి, రాజారెడ్డి, సంచికృష్ణయ్య, శ్రీనివాసులు, దినేష్, ముత్యాలయ్య, శ్రీకాంత్, బంగారునాయుడు, సుబ్రహ్మణ్యం, చిరంజీవి, నాగరాజు తదితరులు ఉన్నారు.

రక్తదానంతో సంపూర్ణ ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సందీప్

కోట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని గూడూరు, నెల్లూ రు ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యాధికారులు డాక్టర్ సందీప్, డాక్టర్ వరప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని విద్యా నగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఇంజనీరింగ్ విద్యార్థులకు రక్తదానంపై అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి, డాక్టర్ రవీంద్రారెడ్డి, డాక్టర్ ఉదయకుమార్ రాజు, డాక్టర్ హరికృష్ణారెడ్డి, ఆయా విభాగాధిపతులు ఉన్నారు.

కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువు పొడిగింపు

తడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : వివిధ కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేసే రుణాలకు దరఖాస్తు గడువు ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు ఎంపీడీవో విజయకుమార్ అన్నారు. అన్ని కార్పొరేషన్లకు సంబంధించి తడ మండలానికి 63 యూనిట్లకు రుణాలు మంజూరు చేసేలా ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని అయితే ఇప్పటివరకు 39 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని వివరించారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్యాస్ పైప్‌లైన్ మీదుగా తవ్వకాలు నిషేధం

ఓజిలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటైన ఉన్న గ్యాస్ స్టేషన్ పరిధిలోని పైప్‌లైన్ మీదుగా తవ్వకాలు ప్రమాదకరమని యాజమాన్యం గురువారం హెచ్చరించింది. ఇక్కడి నుంచి నాయుడుపేట, అత్తివరం, మేనకూరు సెజ్, గూడూరు ప్రాంతాలకు గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఈ పైప్‌లైన్ మీదుగా ఎవరూ అనుమతి లేకుండా తవ్వకాలు, కట్టడాలు చేపట్టరాదు. అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఈ మేరకు యాజమాన్యం ఒక ప్రకటన విడుదల చేసింది.

జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నియంత్రించవచ్చు


మాట్లాడుతున్న ఆర్టీవో కిషోర్

గూడూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమా దాలను నియంత్రించ వచ్చునని రవాణాశాఖ అధికారి కిషోర్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. అతివేగంగా, మద్యం సేవించి నడపరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు, ఎంవీఐ సునీల్, ఏఎంవీఐలు ప్రభాకర్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



కోట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిట్టేడులో కుడుమల చిన్నఅంకయ్యకు చెం దిన పూరిల్లు గురు వారం అగ్నికి ఆహుతైంది. ఇంటికి తాళంవేసి అంకయ్య తన భార్యతో కలసి పొలం పనులకు వెళ్లాడు. ఇంట్లో వెలుగుతున్న దీపం బుడ్డులు పలికి మంటలు రేగి పూరిల్లును తాకాయి. స్థాని కులు వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. పూర్తిగా ఇల్లు కాలి బూడిదైంది. నిరాశ్రయు లైన చిన్న అంకయ్య కుటుంబానికి టీడీపీ ఎస్సీసెల్ నాయకులు యాకశిరి చిన్నయ్య 25 కేజీల బియ్యం, రూ.2వేల నగదు అందజేశారు.

కోట ప్రభుత్వ ఆస్పత్రిలో తనిఖీలు



కోట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని ప్రభుత్వ 30 పడకల ఆస్పత్రిలో గురువారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘ వేంద్రమీన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిం చారు. తహసీల్దారు జయజయరావుతో కలిసి వైద్యుల గదులు, హాజరుపట్టిలు తనిఖీలు చేశారు. మందులను, స్కానింగ్ యంత్రాలను, బెడ్లను పరిశీలించారు. డాక్టర్ జోమ్‌ప్రియారావులతోపాటు పలువురు డాక్టర్లు, సిబ్బంది పనితీరు గురించి రోగుల వద్ద విచారించారు. నాణ్యమైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం కర్లపూడి ప్రాంతంలోని సాగరమాల రోడ్డు పనులను పరిశీలించారు. ఆర్ఐ మధులత ఉన్నారు.

సీఐటీయూ నూతన కమిటీ

కోట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : కోట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో గురువారం 18 మంది ఆటో డ్రైవర్లతో ఆటో స్టాండ్ ఏర్పాటు చేశారు. ఆటో అసోసియే షన్ సీఐటీయూ అనుబంధ కోట మండల అధ్యక్షుడుగా పుట్టయ్య, ఉపాధ్యక్షుడుగా మల్లికార్జున్ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. వీరితోపాటు మరో 16 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికకావడంతో అభినందించారు. సీఐటీయూ నాయకులు రమణయ్య, నాగరాజు, భాస్కర్, ఆనంద్, సుధాకర్, వినోద్, అశోక్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీ వెంకటస్వామి సేవలు చిరస్మరణీయం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మాజీ ఎంపీ వెంకటస్వామి సేవలు ఎనలేనివని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొప్పోలు సుబ్రహ్మణ్యం బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర మాజీ కార్యదర్శి విజయభాస్కర్ అన్నారు. వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో మీనమేషాలు..!

- ప్రైవేటు విక్రయాలే శరణ్యం
- నష్టపోతున్న రైతులు


ఓజిలిలోని రైతు భరోసా కేంద్రం

ఓజిలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ధాన్యం మార్కెట్‌లో విక్రయించే క్రమంలో రైతులు పడుతున్న అవస్థలు, నష్టాలను నివారించి వారికి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొన్నేళ్లుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. దీంతో రైతులు ప్రైవేటు వ్యక్తుల మోసాలనుంచి తేరుకున్నట్లైంది. అయితే ఈ సీజనులో ఓజిలి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటులో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. గతంలో ధాన్యం కొనుగోలు పొదుపు గ్రూపుల ద్వారా నిర్వహిస్తుండగా దానిని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)కు అప్పగించారు. సజావుగా జరుగుతున్న దానిని సవరిస్తూ గత వైసీపీ ప్రభుత్వం సహకార సంఘంతోపాటు రైతు భరోసా కేంద్రాలకు కూడా బాధ్యతను పంచింది. దీంతో ఇప్పటి వరకు ఎవరు ఏ బాధ్యత చేపట్టాలో సరైన విధానం, సూచనలు అందక ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై స్పష్ట త రాలేదని అధికారులు అంటున్నారు. ఫలితంగా ఆరుగాలం శ్రమించి రైతు పండించిన ధాన్యం అమ్ముకునేందుకు దళారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో రైతులు గిట్టుబాటు ధరతోపాటు తూకంలోనూ నష్టపోవాల్సి వస్తోంది. ఓజిలి మండలంలో ఇప్పటికే ఎలిది పంట చేతికి వచ్చి ధాన్యం విక్రయా లు జరుగుత న్నాయి. ఈ పంటను నేరుగా ప్రభు త్వం నిర్ణయిం చిన ధరతో విక్రయాలు చేపట్టేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరపై రైతులు అసంతృప్తి...

మండలంలో ప్రస్తుత సీజనులో సాగుచేసిన ఆర్ఎన్ఆర్(షుగర్‌లెస్), బీపీటీ-5204, కెఎన్ ఎం-1638 రకాల పంట చేతికి వస్తోంది. ఈ పంటకు వరుసగా రూ. 19750, రూ.20వేలు, రూ.18 800ల వంతున దళారులు ధరను నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. ఈక్రమంలో రైతులు గిట్టుబాటు ధర లేకపోయినా ప్రత్యామ్నాయం లేక ఈ ధరకే విక్రయాలు కొనసాగిస్తున్నారు.

ఎలిది పంట దిగుబడులు తగ్గాయి...

మండలంలో ఈ పర్యాయం ఎలిది పంట దిగుబడి బాగా తగ్గిపోయిందని అంటున్నారు. ఎకరాకు 20 నుంచి 25 బస్తాల ధాన్యం మాత్రమే దిగుబడిగా వస్తోందని పేర్కొంటున్నారు. వచ్చిన పంటకు కూడా సరైన ధర లేదని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

తేమ శాతం పేరుతో కోత...

గిట్టుబాటు ధర లేకపోయినా ఇప్పటికీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ప్రైవేటు విక్రయాలు చేస్తున్నారు. దీంతో ప్రైవేటు వ్యక్తులు తేమ శాతం పేరుతో కోత పెడుతున్నారు. ధాన్యం 75 కిలోల బస్తాకు తేమ, గోనె సంచి వంటి వాటిని కలిపి మొత్తంగా నాలుగు నుంచి 6 కిలోల వరకు తరుగు కింద తీసివేస్తున్నారు. ఫలితంగా రైతులు నష్టపోతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే వినతి


కలెక్టర్ వెంకటేశ్వర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గ అభివృద్ధికి సహకరించాలని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, నియోజకవర్గంలో పెండింగ్ పనులపై చర్చించారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. ఏరియా ఆస్పత్రి అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

నియోజకవర్గ పరిధిలోని పలు గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల మరమ్మతులకు సీఎం చంద్రబాబు రూ.94.56 లక్షలు నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. కోటలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల మరమ్మతులకు రూ.35.80 లక్షలు, చిట్టేడులోని బాలికల వసతిగృహానికి రూ. 10 లక్షలు, మల్లాంలోని బాలుర వసతిగృహానికి రూ. 18లక్షలు, చిట్టమూరు బాలుర వసతిగృహానికి రూ.13.72లక్షలు, గునపాడు గ్రామంలోని బాలుర వసతి గృహానికి రూ. 8లక్షలు, కోటలోని జ్యోతిరావ్‌పూలే గురుకుల పాఠశాలకు రూ.8.9లక్షలు నిధులను మరమ్మతుల నిమిత్తం మంజూరు చేశారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

ఎంపీ మాగుంట కోలుకోవాలని చెంగాళమ్మకు పూజలు


కొబ్బరి కాయలు కొడుతున్న అభిమానులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి త్వరగా కోలుకోవాలంటూ గురువారం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యులు వేనాటి రామచంద్రారెడ్డి అనుచరులు పూజలు చేశారు. చెన్నై అపోలో వైద్యశాలలో మాగుంటకు గుండె శస్త్రచికిత్స విజయవంతంగా చేశారు. ఈ నేపథ్యంలో ఆయన త్వరగా కోలుకోవాలంటూ వేనాటి అను చరులు, మాగుంట అభిమానులు పూజలు చేశారు. 108 కొబ్బరి కాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో కేవీ రెడ్డి, వేనాటి సుమంత్ రెడ్డి, మార్కేండేయులు, పామంజి వెంకట్, మునిరామయ్య, రామ్మూర్తి పలువురు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందజేయాలి


నాయుడుపేట అంగన్వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఫుడ్ కమిషనర్ ప్రతాప్‌రెడ్డి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు నాణ్యమైన ఆహారం అందజేయాలని ఫుడ్ కమిషనర్ విజయ ప్రతాప్‌రెడ్డి అన్నారు. నాయుడుపేటలోని అంగన్వాడీ కేంద్రంలో తయారు చేసిన ఆహార పదార్థాలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల హాజరుపట్టిక, రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి, అంగన్వాడీ సిబ్బంది ఉన్నారు.

సూళ్లూరుపేట: పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని లేనిపక్షంలో చర్యలు తీసుకొంటామని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన అధికారులతో కలిసి సరసమ్మ కట్ట వద్దనున్న అంగన్వాడీ కేంద్రం, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, అంబేద్కర్ గురుకులంలో మధ్యాహ్న భోజనం, వంట గదులు, బియ్యం, కూరగాలయ నిల్వలను తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలలో సిబ్బందికి మెనూ వివరాలు తెలియకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనతో పాటు జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మధులేటి, తూనికల కొలతల అధికారి భరత్‌కుమార్ ఉన్నారు.

అధికార లాంఛనాలతో హెడ్ కానిస్టేబుల్‌కు అంత్యక్రియలు

పెళ్లకూరు, ఫిబ్రవరి 5, (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి 9వ బెటాలియన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జీలపాటూరు గ్రామానికి చెందిన మగ్గం నరసయ్యకు గురువారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వ హించారు. బుధవారం నరసయ్య తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. గుండెపోటుకు గురై మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఏపీ ఎస్పీ డీఎస్పీ విజయానందం, ఇన్‌చార్జ్ కమాండెట్ ఆనంద్‌ఖన్నా, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, ఎస్ గోవిందరాజు, జానయ్య, దొరవాసులు, గార్డ్ ఆఫ్ ఆనర్ సిబ్బంది మురళీకృష్ణ, రమణ, మదన్, రఘువరన్, పోలీస్ అసోసేషన్ సిబ్బంది ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఎన్ఐఓటీలో అవకతవకలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తాం: బీజేపీ

వాకాడు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : తూపిలిపాళెం సముద్రతీరంలో నిర్మిస్తున్న ఎన్ఐఓటీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషియన్ టెక్నాలజీ)లో జరుగుతున్న అక్రమాలను కేంద్రం దృష్టికి తీసుకెళతానని బీజేపీ గూడూరు నియోజకవర్గ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి అన్నారు. నిర్మాణదశలో ఉన్న ఎన్ఐఓటీ కార్యాలయం వద్ద మత్స్యకారులతో కలసి ఆయన గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన 2015లో తూపిలిపాళెం గ్రామానికి చెందిన 10 ఎకరాల భూమిని ఎన్ఐఓటికి ఇచ్చారన్నారు. ఎన్ఐఓటీ పూర్తయితే అభివృద్ధితోపాటు నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన ఉంటుందని ఆశపడ్డామన్నారు. అయితే వందలకోట్లతో జరుగుతున్న పనులు నాసిరకంగా జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా సముద్రపు ఇసుకనే వాడేస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక కార్మికులను కాదని ఇతర రాష్ట్రాల వారిని ఏర్పాటు చేసుకున్నారని తెలియజేశారు. ప్రాజెక్టు ఇన్‌చార్జి శరవన్ పలు అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, పెద్దకాపు మహేంద్ర, మత్స్యకారులు ఉన్నారు.

మద్యం స్వాధీనం ఒకరి అరెస్టు

కోట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం కొత్తపట్నం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్మకాలు సాగుతున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. తిరుమూరు భాస్కర్ వద్ద 9 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

ధాన్యానికి మద్దతు ధర కల్పించండి

పెళ్లకూరు, ఫిబ్రవరి 6, (ఆంధ్రజ్యోతి) : వరికి మద్దతు ధర కల్పించాలని రాష్ట్ర రైతు కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వట్టికుండల శేఖర్‌నాయుడు మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. గురువారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలసి వినతిపత్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఐస్‌క్రీం వ్యాపారి మృతి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో వద్ద గురువారం గుర్తు తెలియని వాహనం ఐస్‌క్రీమ్ ఆటోను ఢీకొనడంతో ఐస్‌క్రీమ్ విక్రయదారుడు చెల్లా వెంకటకృష్ణయ్య (58) మృతి చెందాడు. బాలయపల్లి మండలం గొల్లగుంట గ్రామానికి చెందిన వెంకటకృష్ణయ్య కొంతకాలంగా సూళ్లూరుపేట, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆటోలో ఐస్‌క్రీమ్ విక్రయించేవాడు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ డిపో సమీపంలోని జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఐస్‌క్రీమ్ ఆటోను ఢీకొనడంతో ఆయన తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. హైవే అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

ఆస్పత్రిలో రోగులకు అన్ని వసతులు ఉండాలి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు ప్రభుత్వం అందించే అన్ని సౌకర్యాలు అందేలా చూడాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు వై.సతీష్, హనుమంతరావు, సరిత అన్నారు. గురువారం హెచ్‌డీఎస్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆదేశాల మేరకు కమిటీ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రిలో వసతులపై ఆరాతీశారు. అక్కడ పనిచేసే వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆస్పత్రి ప్రధాన వైద్యులు రమేష్‌తో మాట్లాడుతూ వార్డుల్లో ఫ్యాన్‌లు, నీటి వసతి, ఆక్సిజన్ నిరంతరం అందు బాటులో ఉండేలా చూడాలన్నారు. వైద్య సిబ్బంది లక్ష్మి, సుధీర్, ఆనంద్ ఉన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

వాకాడు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వే గ్రామసభల్లో, రెవెన్యూ సదస్సుల్లోనూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన సూచించారు. మండలంలోని తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వో, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఇచ్చే అర్జీలపై తక్షణమే స్పందించాలన్నారు. తహసీల్దారు రామయ్య, ఆర్ఐ అఖిల్, డీటీ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన భాండాగారానికి బీటలు

- నిర్లక్ష్యపునీడలో పేట గ్రంథాలయం
- అభివృద్ధికి ఆమడదూరం
- ప్రజల నుంచి గ్రంథాలయ పన్నుల వసూళ్లు


నాయుడుపేట దర్గావీధిలోని గ్రంథాలయం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట గ్రామపంచాయతీగా ఉన్న సమయంలోనే 1957లో అప్పటి జనాభాకు అనుగుణంగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. 1980 వరకు గ్రంథాలయం పట్టణ ప్రజలకు ఎంతో సేవలందించింది. ఆ తరువాత గ్రంథాలయ వ్యవస్థలో వచ్చిన మార్పులు, చేర్పుల వల్ల పేట గ్రంథాలయం అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిపోయింది. నేడు పేట 70వేల జనాభాకు చేరింది. మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యింది. అయితే గ్రంథాలయాన్ని అభివృద్ధి పరచడంలో పాలకులు నిర్లక్ష్యం చూపారు. లైబ్రరీ సెస్ రూపేణా లక్షలాది రూపాయలు గ్రంథాలయశాఖకు జమ అవుతున్నా లైబ్రరీ అభివృద్ధిపై దృష్టి సారించలేదు.

శిథిలావస్థలో ఉన్న గదిలోనే పత్రికలను చదువుతున్న పాఠకులు


ఇదీ దుస్థితి

భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గోడలు పగు ళ్లు ఏర్ప డ్డాయి. వర్షానికి ఉరుస్తుంది. గోడలపై చెట్లు మొలిచిపోయాయి. కేవలం దినపత్రికలు మాత్రమే వస్తున్నాయి. లైబ్రేరియన్ ఒక్కరే ఉన్నారు. నిబంధనల మేరకు ఆయనకు సహాయకులుగా ఇద్దరు ఉండాలి. అయితే ఒక్కరు కూడా లేరు. ఇలా సంవత్సరాలు గడిచిపోయాయి.


భవనంపై మొలచిన చెట్లు

నూతన భవనం నిర్మించాలి

శిథిలావస్థకు చేరుకున్న లైబ్రరీ భవనాన్ని తొలగించి నూతన భవనాన్ని నిర్మించాలి. డిజిటల్ లైబ్రరీగా ఏర్పాటు చేయాలి. గ్రంథాలయాధికారిని నియమించాలి.

- గోపాల్, పట్టణవాసి

అన్ని వసతులు కల్పించాలి

అన్ని వసతులతో డిజిటల్ లైబ్రరీ నిర్మించాలి. పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలి. నిరుద్యోగ యువత గ్రంథాలయానికి వచ్చేలా అన్ని వసతులు కల్పించాలి.

- రమణ - పట్టణవాసి

ఇలా చేయాలి

సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న తరుణంలో డిజిటల్ లైబ్రరీ మార్చాలి. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా పుస్తకాలు అందుబాటులో ఉంచాలి. కూలిపోయేలా ఉన్న భవనాన్ని తొలగించి ఆ స్థానంలో పట్టణ జనాభాను దృష్టిలో ఉంచుకుని నూతన భవనం నిర్మించాలి. డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేయాలి.